


PRGI NO: TGTEL/25/A5314

# అర్జున్ సమాచారం

www.arjunsamaachaaram.in

తెలుగు దినపత్రిక

ఎడిటర్ : లింగం రాజయ్య

బ్యూరో చీఫ్ : గిరవెన రాకేష్




నల్లగొండ హైదరాబాద్ రంగారెడ్డి | epaper.arjun saamaacharam.com | ఆదివారం 21, జూన్ 2026 | సంపుటి :1 సంచిక : 173 | పేజీలు : 8 , వెల.2.00




## తెలంగాణలో జూన్ 25 నుంచి సర్ ప్రక్రియ

- సర్ ప్రధాన ఉద్దేశం ఇదే.. ఆందోళన వద్దు
- జులై 31న ఓటర్ల డ్రాఫ్ట్ జాబితా విడుదల
- ఆగస్టు 30 వరకు అభ్యంతరాల స్వీకరణ
- అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలి
- అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితా విడుదల
- ఇందులో రాజకీయ ప్రేమేయం ఏమీ ఉండదు
- రాష్ట్రంలోని ప్రతీ పౌరునికి ఎన్యూమరేషన్ ఫాం
- సీఈవో సుదర్శన్ రెడ్డి

వివరాలు 2లో..

తెలంగాణ రాష్ట్రంలో జూన్ 25 నుంచి సర్ ప్రక్రియ ప్రారంభమవుతుందని ప్రధాన ఎన్నికల అధికారి(సీఈవో) సుదర్శన్ రెడ్డి తెలిపారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. జూన్ 15 నుంచి జూన్24 వరకు సన్నాహక ప్రక్రియ జరుగుతుందని.. జూన్ 25 నుంచి జులై 24 వరకు ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫాం అందజేసే ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. మిస్అయిన వారికి ఫాం 6తో మరోమారు ఎన్యూమరేట్ ఫాం అందజేసే అవకాశం ఉందన్నారు. జులై 31న ఓటర్ల డ్రాఫ్ట్ జాబితా విడుదల చేస్తామని, జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాల స్వీకరణ ఉంటుందన్నారు.

# ఇక గ్రూపులు లేవు..



### షిండే నేతృత్వంలోనిదే అసలైన శివసేన..

### అమిత్ షా సంచలన వ్యాఖ్యలు

2లో..

మహారాష్ట్ర రాజకీయాల్లో మరోసారి పెను తుఫాను చెలరేగింది. శివసేన(ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే) పార్టీలో తీవ్ర తిరుగుబాటు వ్యూహాలు నడుస్తున్నాయనే వార్తల నడుమ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇవాళ(శనివారం) చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర సంచలనం సృష్టిస్తున్నాయి. శివసేన(ఖదీ)లో ఇక ఎలాంటి గ్రూపులు లేవని, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏకనాథ్ షిండే నేతృత్వంలో నడుస్తున్నదే ఏకైక అసలైన శివసేన అని ఆయన స్పష్టం చేశారు. కొల్హాపూర్‌లో జరిగిన బహిరంగ సభలో అమిత్ షా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

## ఒడిశాలో భారీగా అభివృద్ధి ప్రాజెక్టులు

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ శంకుస్థాపనలు

పహాడ్‌పూర్‌ను ప్రధాని మోదీ సందర్శించారు.

ఈ గ్రామాన్ని వేగంగా అభివృద్ధి చేసి 'సోలార్ విలేజ్'గా మారుస్తాం

గ్రామంలోని ప్రతి ఇంటికీ సౌరశక్తి

వివరాలు 2లో..





## బంగ్లాదేశ్‌లో హిందువుల నిరసన.. ఢాకాలో భారీ ర్యాలీ

బంగ్లాదేశ్‌లో మళ్లీ ఉద్రిక్తతలు చెలరేగాయి. శ్రీరాముడి చిత్రంపై చెప్పు ఉంచి తమ మతవిశ్వాసాలను అవమానించారంటూ రాజధాని ఢాకాలో హిందువులు కాగడాలు, కొవ్వొత్తులతో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. జై శ్రీరామ్ అంటూ పెద్ద ఎత్తున నినదించారు. ఉత్తర గాయిబంద జిల్లాలో శ్రీశ్రీ రాధాగోవింద దేవాలయ కమిటీ 81 అడుగుల శ్రీరాముడి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు రంగంలోకి దిగింది.

2

### ఆస్తుల పరిరక్షణ కోసమే హైడ్రా..

## డిజాస్టర్ కోసం కాదు: రంగనాథ్



2

హైడ్రాపై దుష్ప్రచారం జరుగుతోందని.. పనిగట్టుకుని తమను కొందరు బద్నాం చేస్తున్నారని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం ఉండాలని తెలిపారు. దోపిడీకి గురికాకుండా ఉండాలని ప్రత్యేక తెలంగాణ కోసం ఇక్కడి ప్రజలు కొట్లాడారని తెలిపారు. హైడ్రా ద్వారా లక్షా పదివేల కోట్ల ఆస్తులు కాపాడామని వివరించారు. ఈరోజు (శనివారం) హైదరాబాద్ వేదికగా రంగనాథ్ మీడియాతో మాట్లాడారు. హైడ్రా ద్వారా 600 ఆపరేషన్స్ పూర్తి చేశామని తెలిపారు.



2

## పోక్సో కేసులో బండి భగీరథ్‌కు ఊరట.. మధ్యంతర బెయిల్ మంజూరు

### సర్‌పై అప్రమత్తంగా ఉండాలి..

## లేకపోతే నష్టపోతాం

2



సర్ పై అప్రమత్తంగా లేకపోతే అనేక రకాల సమస్యలు ఎదుర్కోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఈరోజు(శనివారం) పై ముఖ్య కార్యకర్తలతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఖమ్మం నియోజకవర్గంలో 3,02,800 ఓట్లు ఉంటే అందులో సగం ఓట్లు కూడా మ్యాపింగ్ కాలేదన్నారు. లక్షన్నరకు పైగా ఓట్లు పోయే పరిస్థితి కనపడుతోందన్నారు. ఇప్పటికైనా అప్రమత్తం కావాలని.. ప్రతి ఒక్క ఓటుని కాపాడుకోవాలన్నారు.

# తెలంగాణలో జూన్ 25 నుంచి సర్ ప్రక్రియ

### సర్ ప్రధాన ఉద్దేశం ఇదే.. ఆందోళన వద్దు
### జులై 31న ఓటర్ల డ్రాఫ్ట్ జాబితా విడుదల
### ఆగస్టు 30 వరకు అభ్యంతరాల స్వీకరణ
### అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలి
### అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితా విడుదల
### ఇందులో రాజకీయ ప్రేరేపితం ఏమీ ఉండదు
### రాష్ట్రంలోని ప్రతీ పౌరునికి ఎన్యూమరేషన్ ఫాం
### సీఈవో సుదర్శన్ రెడ్డి

హైదరాబాద్, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

తెలంగాణ రాష్ట్రంలో జూన్ 25 నుంచి సర్ ప్రక్రియ ప్రారంభమవుతుందని ప్రధాన ఎన్నికల అధికారి(సీఈవో) సుదర్శన్ రెడ్డి తెలిపారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. జూన్ 15 నుంచి జూన్24 వరకు సన్నాహక ప్రక్రియ జరుగుతుందని.. జూన్ 25 నుంచి జులై 24 వరకు ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫాం అందజేసే ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. మిస్అయిన వారికి ఫాం 6తో మరోమారు ఎన్యూమరేట్ ఫాం అందజేసే అవకాశం ఉందన్నారు. జులై 31న ఓటర్ల డ్రాఫ్ట్ జాబితా విడుదల చేస్తామని, జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాల స్వీకరణ ఉంటుందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితా విడుదల చేయనున్నట్లు సీఈవో వెల్లడించారు. ఓటరు జాబితాలో ప్రస్తుతం ఎక్కడ ఓటు ఉందో అదే అడ్రస్‌కు ఎన్యూమరేషన్ ఫాం వస్తుందని సీఈవో తెలిపారు. ఆ అడ్రస్‌లో ఓటరు లేకపోతే అతని ఓటు అక్కడ తొలగించబడుతుందన్నారు. ప్రస్తుతం ఉంటున్న అడ్రస్‌తో మళ్లీ ఓటరు ఫాం8తో ఓటును ఎన్రోల్మెంట్ చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. ా×= ప్రధాన ఉద్దేశం ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేయడమని.. ఓటర్లను తొలగించడం కాదు స్పష్టం చేశారు. 24 ఏళ్లుగా ఇక్కడ ఓటర్ జాబితా శుద్ధి జరగలేదన్నారు. ఈ మధ్య కాలంలో చాలా మంది మృతి చెంది ఉంటారని.. కొందరు వలస వెళ్లి ఉంటారని తెలిపారు. వాటన్నింటినీ సరి చేయడమే ా×= ఉద్దేశమని చెప్పారు. ఇందులో రాజకీయ ప్రేరేపితం ఏమీ ఉందన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్రంలోని ప్రతీ పౌరునికి ఎన్యూమరేషన్ ఫాం ఇస్తారని తెలిపారు. కులం, మతంతో సంబంధం లేకుండా అందరికీ ఫాం ఇస్తారన్నారు. ఎన్యూమరేషన్‌లో ముస్లిం, హిందూ అనే వ్యత్యాసం ఉండదని చెప్పారు. ఒక వర్గం ఓట్లు తొలగిస్తారనే ఆందోళన అవసరం లేదని సీఈవో సుదర్శన్ రెడ్డి వెల్లడించారు.

# ఇక గ్రూపులు లేవు..

## షిండే నేతృత్వంలోనిదే అసలైన శివసేన.. అమిత్ షా సంచలన వ్యాఖ్యలు

కొల్హాపూర్, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

మహారాష్ట్ర రాజకీయాల్లో మరోసారి పెను తుఫాను చెలరేగింది. శివసేన(ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే) పార్టీలో తీవ్ర తిరుగుబాటు వ్యూహాలు నడుస్తున్నాయనే వార్తల నడుమ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇవాళ(శనివారం) చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర సంచలనం సృష్టిస్తున్నాయి. శివసేన(ఖుదీ)లో ఇక ఎలాంటి గ్రూపులు లేవని, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏకనాథ్ షిండే నేతృత్వంలో నడుస్తున్నదే ఏకైక అసలైన శివసేన అని ఆయన స్పష్టం చేశారు. కొల్హాపూర్‌లో జరిగిన బహిరంగ సభలో అమిత్ షా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

### 'షిండే గ్రూప్' అనాల్సిన అవసరం లేదు

సభను ఉద్దేశించి అమిత్ షా మాట్లాడుతూ.. 'గతంలో మనం ఏకనాథ్ షిండే పేరును ప్రస్తావిస్తూ 'శివసేన షిండే గ్రూప్' అని పిలవాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు రాష్ట్రంలో ఎలాంటి గ్రూపులు లేవు. ఒకే ఒక్క శివసేన ఉంది. అది షిండే నేతృత్వంలోనిదే' అని ప్రకటించారు.అంతకుముందు కొల్హాపూర్‌లోని ప్రముఖ మాతా అంబాబాయి ఆలయాన్ని సందర్శించిన అమిత్ షా.. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహారాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టబోయే ఆలయ ఆధునీకీకరణ, కారిడార్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన 'వికాస్ భీ, విరాసత్ భీ(అభివృద్ధి, వారసత్వం)' అనే సంకల్పంతోనే దేశంలో సాంస్కృతిక



పునరుజ్జీవనం జరుగుతోందని, మహారాష్ట్రలోని అన్ని జ్యోతిర్లింగాలు, శక్తి పీఠాలను ప్రభుత్వం పునరుద్ధరిస్తోందని అమిత్ షా ఈ సందర్భంగా చెప్పారు.

### ఉద్ధవ్ ఠాక్రే పార్టీలో 'ఆపరేషన్ టైగర్'

మరోవైపు.. ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన(ఖుదీ) తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. ఆ పార్టీకి చెందిన పలువురు పార్లమెంట్ సభ్యులు సమూహంగా ఏర్పడి ఏకనాథ్ షిండే వైపు వెళ్లేందుకు సిద్ధమయ్యారని, దీనికి 'ఆపరేషన్ టైగర్'అని పేరు పెట్టినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలు ఉద్ధవ్ వర్గంలో తీవ్ర కలకలం రేపుతున్నాయి. పార్టీ ఎంపీల బహిరంగ అసమ్మతి, బెదిరింపులు, చట్టపరమైన చర్యల హెచ్చరికలతో ఉద్ధవ్ శిబిరంలో కలవరం మొదలైంది.

### ఎంపీలకు షోకాజ్ నోటీసులు – అనర్హత వేటు హెచ్చరిక

ఢిల్లీలో ఇటీవల ఉద్ధవ్ ఠాక్రే పక్షం అత్యవసరంగా నిర్వహించిన పార్లమెంటరీ పార్టీ సమావేశం ఈ చీలికను స్పష్టం చేసింది. ఆ పార్టీకి మొత్తం 9 మంది లోక్‌సభ ఎంపీలలో ముగ్గురు(అరవింద్ సావంత్, అనిల్ దేశ్‌రాయ్, రాజభావు వాజే) మాత్రమే హాజరయ్యారు. మిగిలిన ఆరుగురు నాగేష్ ఆష్టికర్, సంజయ్ దేశ్‌ముఖ్, సంజయ్ జాదవ్, సంజయ్ దినా పాటిల్, ఓంప్రకాష్ రాజేనింబాల్కర్, భావుసాహెబ్ వాక్‌చౌరే ఈ సమావేశానికి హాజరు కాలేదు. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన శివసేన చీఫ్ విప్ అనిల్ దేశాయ్, గైర్హాజరైన ఆరుగురు ఎంపీలకు 'షోకాజ్' నోటీసులు జారీ చేశారు. వారికి కేవలం 24 గంటల గడువు ఇచ్చారు. నిర్ణీత సమయంలోగా వారు లిఖితపూర్వకంగా సరైన కారణాలు చెప్పకపోతే, వారు స్వచ్ఛందంగా పార్టీ సభ్యత్వాన్ని వదులుకున్నట్లు భావిస్తామని హెచ్చరించారు. అంతేకాకుండా, భారత రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ (పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం) ప్రకారం వారిపై లోక్‌సభలో అనర్హత వేటు వేయడానికి చర్యలు తీసుకుంటామని నోటీసులో స్పష్టం చేశారు. ఉద్ధవ్ వర్గంలో ఎంపీల తిరుగుబాటు ఊహాగానాలు నిజమవుతున్న తరుణంలో, అధికారిక శివసేన షిండేదేనంటూ అమిత్ షా చేసిన తాజా ప్రకటన మహారాష్ట్ర రాజకీయాలను ఊహించని మలుపులు తిప్పే అవకాశం కనిపిస్తోంది.

# బంగ్లాదేశ్‌లో హిందువుల నిరసన.. ఢాకాలో భారీ ర్యాలీ

ఇంటర్నెట్ డెస్క్: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

బంగ్లాదేశ్‌లో మళ్లీ ఉద్రిక్తతలు చెలరేగాయి. శ్రీరాముడి చిత్రంపై చెప్పు ఉంచి తమ మతవిశ్వాసాలను అవమానించారంటూ రాజధాని ఢాకాలో హిందువులు కాగడాలు, కొవ్వొత్తులతో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. జై శ్రీరామ్ అంటూ పెద్ద ఎత్తున నినదించారు. ఉత్తర గాయిబంద జిల్లాలో శ్రీశ్రీ రాధాగోవింద దేవాలయ కమిటీ 81 అడుగుల శ్రీరాముడి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు రంగంలోకి దిగింది. అయితే, అతివాదుల నుంచి బెదిరింపులు రావడంతో కార్యక్రమం వాయిదా పడింది. ఈ నేపథ్యంలో తాజాగా కొందరు అవమానకర చర్యలకు దిగడంతో పరిస్థితి మరోసారి ఉద్రిక్తంగా మారినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ క్రమంలో ఢాకాలో వేల మంది హిందువులు నిరసనకు దిగారు. పలు హిందూ సంఘాల ఆధ్వర్యంలో జై శ్రీరామ్ అని నినదిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు.ర్యాలీకి తరలి రావాలన్న హిందూ మహాజ్యోత్ సంస్థ పిలుపు మేరకు శుక్రవారం సామాన్య ప్రజలు, ఇతర హిందూ సంఘాలు షహబాగ్ కూడలికి పెద్ద సంఖ్యలో వచ్చారు. అక్కడి నుంచి నేషనల్ ప్రెస్ క్లబ్ వరకూ ర్యాలీగా వెళ్లారు. ప్రెస్‌క్లబ్ ముందు భారీ మానవహారంతో నిరసన తెలిపారు. మరికొంత మంది ఢాకా రిపోర్టర్స్ యూనిటీ భవనం ముందు నిరసన చేపట్టారు. రంగపూర్‌లో నిరసన తెలిపిన వారిని పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ఉద్రిక్తతలు పెరిగాయి. మైనారిటీలు ఇన్ని ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం మౌనంగా ఉంటోందని నిరసనకారులు ఆరోపించారు. తమ మతవిశ్వాసాలను అవమానించిన వారిని 72 గంటల్లోగా అరెస్టు చేయాలని అల్టిమేటమ్ జారీ చేశారు. లేని పక్షంలో నిరసనలు మరింత తీవ్రమవుతాయని హెచ్చరించారు.

# ఒడిశాలో భారీగా అభివృద్ధి ప్రాజెక్టులు

### రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ శంకుస్థాపనలు
### పహాడ్‌పూర్‌ను ప్రధాని మోదీ సందర్శించారు.
### ఈ గ్రామాన్ని వేగంగా అభివృద్ధి చేసి 'సోలార్ విలేజ్'గా మారుస్తాం
### గ్రామంలోని ప్రతి ఇంటికీ సౌరశక్తి

మయూర్‌భంజ్(ఒడిశా), అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఒడిశాలోని మయూర్‌భంజ్‌లో జరిగిన 'వికాస్ రా ధారా, ఒడిశా సారా' బహిరంగ సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒడిశా సర్వతోముఖాభివృద్ధి కోసం దాదాపు రూ.47,000 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం రోజే ఈ కార్యక్రమం జరగడం విశేషం. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం సందర్భంగా ఆమె స్వగ్రామమైన పహాడ్‌పూర్‌ను ప్రధాని మోదీ సందర్శించారు. ఈ గ్రామాన్ని వేగంగా అభివృద్ధి చేసి 'సోలార్



విలేజ్'గా మారుస్తామని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలోని ప్రతి ఇంటికీ సౌరశక్తి అందుతుంది. ఒడిశాలోని ప్రసిద్ధ కోణార్క్ సూర్య దేవాలయానికి ఉన్న గుర్తింపు తరహాలోనే, పహాడ్‌పూర్ గ్రామం కూడా ప్రపంచపటంలో పునరుత్పాదక ఇంధన కేంద్రంగా సరికొత్త గుర్తింపును పొందుతుందని ప్రధాని పేర్కొన్నారు.

### పారిశ్రామిక ప్రగతి, 'ఉత్కర్ష్ ఒడిశా'

ఒడిశాలోని సహజ వనరులను ఆర్థిక అవకాశాలుగా మార్చడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ప్రధాని తెలిపారు. రాష్ట్రంలో భారీగా పారిశ్రామిక వృద్ధి జరుగుతోందని, అంతర్జాతీయ, దేశీయ పెట్టుబడిదారులను ఆకర్షించడంలో 'ఉత్కర్ష్ ఒడిశా' ప్రచారం కీలక పాత్ర పోషిస్తోందని ఆయన కొనియాడారు. కొత్త పరిశ్రమల స్థాపన ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గిరిజన యువతకు మెరుగైన విద్య, ఉపాధి అవకాశాలను అందించడం ద్వారా వారిని సాధికారత వైపు నడిపించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మోదీ పునరుద్ఘాటించారు. గిరిజన పిల్లలకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించేందుకు దేశవ్యాప్తంగా సుమారు 500 ఏకలవ్య మోడల్ స్కూళ్లను ప్రారంభించామని తెలిపారు.

### సంస్కృతి, సంప్రదాయాలకు గౌరవం

అంతకుముందు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ కలిసి పహాడ్‌పూర్ గ్రామంలోని 'సంతాలీ జాహిరా', 'హో జాహిరా' అనే పవిత్ర వనాలలో సంప్రదాయ పూజలు, ఆచారాలు నిర్వహించి దేశ శ్రేయస్సు కోసం ప్రార్థించారు. ప్రస్తుతం ఒడిశాలో పండుగ వాతావరణం నెలకొందని, గత వారమే 'గాన్ పర్వా' పండుగను ఘనంగా జరుపుకున్నారని, అలాగే జగన్నాథ రథయాత్ర, బరిపద రథయాత్ర ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని ఈ సందర్భంగా ప్రధాని గుర్తుచేశారు. ఈ ఉత్సవాల మధ్య 'ప్రజాస్వామ్యం, అభివృద్ధి' అనే పండుగ కూడా ఇక్కడ నడుస్తోందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

# ఆస్తుల పరిరక్షణ కోసమే హైడ్రా.. డిజాస్టర్ కోసం కాదు: రంగనాథ్

హైదరాబాద్,

హైడ్రాపై దుష్ప్రచారం జరుగుతోందని.. పనిగట్టుకుని తమను కొందరు బద్నాం చేస్తున్నారని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం ఉండాలని తెలిపారు. దోపిడీకి గురికాకుండా ఉండాలని ప్రత్యేక తెలంగాణ కోసం ఇక్కడి ప్రజలు కొట్లాడారని తెలిపారు. హైడ్రా ద్వారా లక్షా పదివేల కోట్ల ఆస్తులు కాపాడామని వివరించారు. ఈరోజు (శనివారం) హైదరాబాద్ వేదికగా రంగనాథ్ మీడియాతో మాట్లాడారు. హైడ్రా ద్వారా 600 ఆపరేషన్స్ పూర్తి చేశామని తెలిపారు. చట్టం అందరికీ ఒకటేనని... హైడ్రా ఎవరికీ పక్షపాతంగా వ్యవహరించదని స్పష్టం చేశారు. హైడ్రా డిజాస్టర్ కోసం కాదని.. ఆస్తుల పరిరక్షణ కోసమేనని తేల్చిచెప్పారు. సోషల్ మీడియాలో తమపై అసత్యాలు చెబుతున్నారని అన్నారు.

ప్రభుత్వ ఆస్తులను కాపాడుతున్నాం..

ప్రభుత్వ ఆస్తులను కాపాడటంలో రాష్ట్ర సర్కార్ హైడ్రాకి ఫ్రీడం ఇచ్చిందని రంగనాథ్ వెల్లడించారు. పార్టీలకు అతీతంగా తాము పనులు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. భాగ్యనగరంలో ఫాతిమా కాలేజీ లాగా చాలా స్కూల్స్, కాలేజీలు ఉన్నాయని ప్రస్తావించారు. హైడ్రాకి ఎంఐఎం, కాంగ్రెస్ అందరూ ఒకటేనని తేల్చిచెప్పారు. హైడ్రా ఎప్పుడూ సైలెంట్‌గా ఉండదన్నారు. హైడ్రా రాత్రికి రాత్రి నిర్మాణాలను కూలగొడుతుందనేది తప్పుడు ప్రచారమని తెలిపారు. గుడిసెలు వేసిన చోట మీడియాని తీసుకెళ్లి చూపించామని... అప్పుడు ఉన్నదాని కంటే వంద గుడిసెలు ఎక్కువగా పెరిగాయని.. దాని వెనకాల కొన్ని శక్తులు ఉన్నాయని చెప్పుకొచ్చారు. గుడిసెలు వేసిన చోట జెన్యూన్‌గా ఉన్నాయా? లేదా? పరిశీలించి... డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

మంచి చేయాలంటే కొందరికి చెడు జరుగుతుంది..

హైడ్రా రాకపోతే... ఇప్పుడు ఉన్నవి కూడా కనపడకుండా పోయేవని రంగనాథ్ తెలిపారు. ఈ నెల 9వ తేదీన భాగ్యనగరంలో కురిసిన వర్షానికి సిటీ అతలాకుతలం అయిందని అన్నారు. లక్షమందికి మంచి చేయాలంటే కొందరికి చెడు జరుగుతుందని తెలిపారు. హైడ్రా తప్పు ఉంటే తప్పకుండా క్షమాపణ అడుగుతామని చెప్పారు. హైడ్రా చాలా నేర్చుకుందని, చాలా పనులు పూర్తి చేసిందని... తప్పులు జరిగితే.. సరి చేసుకుంటూ ముందుకెళ్తుందని వివరించారు. హైడ్రా సెటిల్‌మెంట్లకు అడ్డాగా కాకుండా.. రాజకీయాలకు అతీతంగా ముందుకు పోతుందని స్పష్టం చేశారు. ప్రజలకు నమ్మకం, విశ్వాసం కలిగేంచే విధంగా హైడ్రా పని చేస్తోందని రంగనాథ్ పేర్కొన్నారు.

# పోక్సో కేసులో బండి భగీరథ్‌కు ఊరట.. మధ్యంతర బెయిల్ మంజూరు

హైదరాబాద్, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

పోక్సో కేసులో రిమాండ్‌లో ఉన్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌కు మేడ్చల్--మల్కాజిగిరి కోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 26వ తేదీ వరకు వారంపాటు మధ్యంతర బెయిల్ కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే షరతులను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందని న్యాయమూర్తి స్పష్టం చేశారు.పోక్సో చట్టం కింద నమోదైన కేసులో భగీరథ్‌ను పేట్ బషీరాబాద్ పోలీసులు మే 16వ తేదీన అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచిన విషయం తెలిసిందే. అనంతరం భగీరథ్‌ను రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి ఆయన చర్లపల్లి సెంట్రల్ జైల్లో ఉన్నారు. ఇంజినీరింగ్ పరీక్షలకు హాజరయ్యేందుకు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని భగీరథ్ తరఫు న్యాయవాదులు కోర్టును ఆశ్రయించారు. విద్యా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చేసిన వాదనలను పరిశీలించిన న్యాయస్థానం ఆయనకు వారంపాటు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. కోర్టు ఆదేశాల మేరకు భగీరథ్ ఈరోజు(శనివారం) మధ్యాహ్నం చర్లపల్లి జైలు నుంచి విడుదలయ్యారు.ఈ కేసు రాజకీయంగా కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు కావడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అయితే ప్రస్తుతం మేడ్చల్ -- మల్కాజిగిరి కోర్టు ఇచ్చిన మధ్యంతర బెయిల్‌తో భగీరథ్ తన పరీక్షలకు హాజరుకానున్నారు.

# సర్‌పై అప్రమత్తంగా ఉండాలి.. లేకపోతే నష్టపోతాం:

### మంత్రి తుమ్మల నాగేశ్వరావు

ఖమ్మం జిల్లా,

సర్ పై అప్రమత్తంగా లేకపోతే అనేక రకాల సమస్యలు ఎదుర్కోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఈరోజు(శనివారం) పై ముఖ్య కార్యకర్తలతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఖమ్మం నియోజకవర్గంలో 3,02,800 ఓట్లు ఉంటే అందులో సగం ఓట్లు కూడా మ్యాపింగ్ కాలేదన్నారు. లక్షన్నరకు పైగా ఓట్లు పోయే పరిస్థితి కనపడుతోందన్నారు. ఇప్పటికైనా అప్రమత్తం కావాలని.. ప్రతి ఒక్క ఓటుని కాపాడుకోవాలన్నారు. ఓట్లను కాపాడుకోలేకపోతే భవిష్యత్తు రాజకీయం లేదని వ్యాఖ్యానించారు.మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మూడు శాతం ఓట్ల తేడాతోనే గెలవడం జరిగిందని మంత్రి తెలిపారు. ా×= కార్యక్రమంలో 55 శాతానికి పైగా ఓట్లు కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. అప్రమత్తంగా లేకపోతే తీవ్రంగా నష్టపోతామని అన్నారు. మమతా బెనర్జీ, స్టాలిన్ ఓడిపోవడానికి కారణాలు, పరిస్థితులు గుర్తు చేసుకోవాలని నాయకులకు సూచించారు. రాజకీయాల్లో ఉండాలనుకునే వారికి జీవన్మరణ సమస్య తప్పదన్నారు. బీజేపీ కావాలని ఓట్ల తొలగిస్తోందని, మరో పార్టీ మరోలా చేస్తోందని రకరకాల ప్రచారాలు వస్తున్నాయన్నారు. ఈ క్లిష్ట పరిస్థితులలో అప్రమత్తంగా లేకపోతే నష్టపోతామని తెలిపారు. అధికారులకు సహకరించాలని, వారితో కలిసి సమన్వయం చేసుకొని ఓట్లను కాపాడుకోవాలని నేతలకు మంత్రి తుమ్మల నాగేశ్వరావు సూచించారు.

# సన్నవడ్లకు పెరుగుతున్న ధరలు

## కేసముద్రం మార్కెట్లో పెరిగిన కొనుగోళ్లు

మహబుబాబాద్,

సన్న ధాన్యానికి మద్దతు పెరుగుతోంది. మార్కెట్లలో మద్దతు ధరలను మించి ధరలు పెంచి కొనుగోళ్లు చేస్తున్నారు. ఈయేడు సరిగా పంటలు పండకపోతే ధరలు పెరుగుతాయన్న భావనలో వ్యాపారులు ఉన్నారు. మహబుబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో ధాన్యం ధర ఈ



సీజన్‌లో అత్యధికంగా క్వింటాకు రూ.2,906 నమోదైంది. గత 15 రోజులుగా ఈ మార్కెట్‌లో ఆర్‌ఎన్‌ఆర్ రకం వడ్లరేట్ రోజురోజుకూ పెరుగుతోంది. స్థానిక మార్కెట్‌కు ఈ- వేలం'లో క్వింటాకు గరిష్ఠంగా రూ.2,906, కనిష్ఠంగా రూ.2, 226, సగటున రూ.2,589 ధరలతో వ్యాపారులు ఖరీదులు చేశారు. ధాన్యానికి ప్రభుత్వ కనీస మద్దతు ధర క్వింటాకు రూ.2,389 ఉండగా, ఈ సీజన్‌లో అంతకంటే ఎక్కువగానే మార్కెట్లో ధరలు ఉన్నాయి. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా ఉంటాయనే కారణాలతో వ్యాపారులు నిల్వ చేసేందుకు మార్కెట్లో ధాన్యం ఖరీదులు పెంచారు. ఈ క్రమంలో దేశీయంగా ధాన్యానికి డిమాండ్ ఏర్పడడంతో మార్కెట్లో ఈ సీజన్‌లో గత 15 రోజులుగా ధాన్యం సగటు ధర పెరుగుతూ వస్తోంది. ఈ నెల 1న ధాన్యం సగటు ధర రూ.2,475 నుంచి రూ.2,495 వరకు ఉన్నాయి. ఆ తర్వాత ఈనెల 4న సగటు ధర రూ.2, 589, 5న రూ.2636, 8న రూ.2,689, 9న రూ.2,729గా నమోదయ్యాయి. తాజా గా గరిష్ఠ ధర రూ.2,900 మార్కు దాటడం విశేషం.

# నెత్తురోడిన రాష్ట్ర రహదారులు

## వేర్వేరు ప్రమాదాల్లో 8మంది మృతి

## మేడ్చల్ వద్ద ప్రమాదంలో ముగ్గురు మృతి

## వరంగల్ రహదారి ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం

హైదరాబాద్,

రాష్ట్రంలోని రహదారులు నెత్తురోడాయి. వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఎనిమిది మంది మృతి చెందారు. హైదరాబాద్ – వరంగల్ జాతీయ రహదారిపై మినీ ట్రక్కును లారీ ఢీ కొట్టిన ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందారు. ఎస్సై బండి శ్రవణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. దేవరుప్పుల మండలంలో కిరాణా దుకాణం నిర్వహించే జాట్ రోహిత్, యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బండ కొత్తపల్లికి చెందిన మధు.. టాటా ఏస్ మినీ ట్రక్కులో హైదరాబాద్ నుంచి కిరాణా సామగ్రి తీసుకొస్తుండగా.. తెల్లవారుజామున జనగామ జిల్లా లింగాలఘనపూర్ మండలం నెల్లుట్ల సమీపంలోకి రాగానే ట్రక్కు టైరు పంక్చర్ అయింది. అదే దారిలో వెళ్తున్న లారీని ఆపి జాకీ తీసుకున్నారు. లారీ క్లీనర్ రాజేందర్, ట్రక్కు డ్రైవర్ మధు, కిరాణా దుకాణ యజమాని రోహిత్.. పంక్చర్ అయిన టైరును మారుస్తున్న క్రమంలో వెనుక నుంచి మరో లారీ వేగంగా వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ఇద్దరు జనగామ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ పరిధిలోని తుర్కపల్లి–మురహరిపల్లి మధ్య ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కరీంనగర్ నుంచి హైదరాబాద్ వైపు వస్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. ఆ తర్వాత అతి వేగంతో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సమాచారం అందిన వెంటనే మేడ్చల్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు ముమ్మరం చేశారు. కారులో నుంచి మృతదేహాలను వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుల వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. ఈ ప్రమాదంతో హైవేపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు యత్నించారు. వికారాబాద్‌జిల్లా పరిగి మండలం చిగురాల్‌పల్లి వద్ద బైక్‌ను టిప్పర్ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో మోమిన్‌కలాన్‌కు చెందిన జావీద్‌పాషా (30) అక్కడికక్కడే మృతి చెందారు.

ప్రమాదంపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. మరో ముగ్గురు గాయపడ్డారు. హైదరాబాద్ నుంచి జగిత్యాల వైపు వెళ్తున్న కారు, డీసీఎం వ్యాన్ సిరిసిల్ల బైపాస్‌పై ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న అభిషేక్ అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ముగ్గురు గాయపడ్డారు. కారులో ప్రయాణిస్తున్న వారిది జగిత్యాలగా తెలుస్తోంది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

# చిన్నారి జ్ఞానేశ్వరి ఆచూకీ కోసం గాలింపు ముమ్మరం

## పవన్ ఆదేశాలతో అటవీశాఖ ప్రత్యేక దృష్టి

కాకినాడ

తునిలో చిన్నారి జ్ఞానేశ్వరి ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. రోజులు గడుస్తున్నా చిన్నారి జాడ లభించకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారి ఆచూకీ కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు అటవీ శాఖ, ప్రత్యేక హనుమాన్ టీమ్ సంయుక్తంగా థర్మల్ డ్రోన్ల సహాయంతో సెర్చింగ్ ఆపరేషన్‌ను నిర్వహిస్తున్నాయి. రాత్రి వేళల్లోనూ పాప కోసం విస్తృతంగా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. థర్మల్ డ్రోన్ల ద్వారా అటవీ జంతువుల కదలికలపైనా అధికారులు నిఘా పెట్టారు. చిన్నారిని అడవి జంతువులు ఎత్తుకెళ్లి ఉండవచ్చన్న అనుమానంతో.. ఆ కోణంలోనూ గాలింపు కొనసాగుతోంది. అటవీ ప్రాంతాల్లో జంతువుల కదలికలను గుర్తించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. చిన్నారి జాడను కనిపెట్టడం కోసం పోలీసులు ఇప్పటికే రెండు బొమ్మలను వేలాడదీసి, వాటిలో మాంసం ఎరగా ఉంచారు. ఇప్పటివరకు ఎలాంటి జంతువుల జాడ కానరాకపోవడం గమనార్హం. చిన్నారి ఆచూకీ కోసం అన్ని కోణాల్లోనూ దర్యాప్తు కొనసాగుతోంది. పాప క్షేమంగా తిరిగి రావాలని తల్లిదండ్రులతో పాటు స్థానిక ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

# రాధాగాయత్రి మృతిపై తల్లి అనుమానం

విశాఖపట్నం,

విశాఖకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రాధా గాయత్రి మృతి కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. భర్తతో కలిసి ఉత్తరాఖండ్ వెళ్లిన గాయత్రి అనుమానాస్పదస్థితిలో మరణించింది. గాయత్రి మృతి పట్ల అనుమానం వ్యక్తం చేస్తున్న తల్లి సత్యవతి.. దీనిపై విశాఖ పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. తన అల్లుడు శ్రీచరణ్‌పైనే అనుమానం ఉందన్నారు. ఈ కేసులో పోలీసులు లోతైన దర్యాప్తు చేస్తే అనేక విషయాలు బయటపడతాయని తల్లి సత్యవతి చెప్పారు. 'నా కూతురి మృతి విషయంలో అల్లుడుపైనే అనుమానం. నా కూతురికి మద్యం సేవించే అలవాటు లేదు. గాయత్రిపై అనుమానంతోనే హత్య చేసి ఉండొచ్చు. రిషికేశ్, హరిద్వార్ వెళు తున్నామని చివరిసారిగా నాకు చెప్పింది. విహారయాత్ర ముగించుకొని విశాఖకు వస్తానని చెప్పింది. విశాఖకు రాకుండానే నా కూతుర్ని హతమార్చారు. విశాఖకు వచ్చిన తర్వాత రెండు నెలలు వర్క్ ఫ్రం హోం పెట్టి ఇక్కడే ఉంటాను అని చెప్పింది.

# కేంద్రానిది అప్పుడూ, ఇప్పుడూ మొండివైఖరే

## కేసిఆర్ రైతులకు అండగా ధాన్యం కొనుగోళ్లు

## 12 వేల కోట్లు ధాన్యం కొనుగోళ్లకు కేటాయించారు

## మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి

నిజామాబాద్,

ధాన్యం కొనుగోళ్లలో బిఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కూడా కేంద్రం కక్షపూరితంగా వ్యవహరించిందని, అయినా ఆనాటి సిఎం కెసిఆర్ ఏనాడూ రైతులకు అన్యాయం చేయలేదని, మాజీమంత్రి, బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. రైతులకు అండగా నిలిచి ఊరూరా కొనుగోలు కేంద్రాలతో పంటలు కొనుగోలు చేయించిన ఘనత కెసిఆర్‌దని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఉత్పత్తి అయిన మొత్తం ధాన్యంలో 3వ వంతు, ఇతర పంటల్లో 25శాతం కొనుగోలు చేయడం ఇప్పుడే అమలుచేసిన కొత్త విధానం కాదు. నాడు బీఆర్‌ఎస్ సర్కార్ హయాంలోనూ కేంద్ర ప్రభుత్వం ఇదే వైఖరిని అవలంబించింది. రాష్ట్రంలో రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయబోమని అనేక ఇబ్బందులకు గురిచేసింది. ఒక దశలో అప్పటి సీఎం కేసీఆర్ ఏకంగా కేంద్ర ప్రభుత్వంపై తెలంగాణ రైతుల తరఫున పెద్ద పోరాటమే చేశారు. అయినప్పటికీ కేంద్రం తెలంగాణ రైతుల పట్ల తన వివక్షను వీడలేదని గుర్తు చేశారు. ఉత్పత్తి అయిన మొత్తం పంటను కేంద్రమే కొనుగోలు చేయాలని తామూ పోరాడామని అన్నారు. కేంద్రం నిరాకరించినా రాష్ట్రం ముందుకు వచ్చి ధాన్యం సేకించిందని వేముల అన్నారు.కానీ ప్రస్తు రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేదని చెబుతున్నది. ఈ నేపథ్యంలో ఓ వైపు కేంద్రం 25శాతం పంటల్ని మాత్రమే కొనుగోలు చేయడం, మిగిలిన పంటను కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిరాకరిస్తుండటంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరకంగా మారింది. పంటల కొనుగోళ్లపై ఇటు రాష్ట్రం, అటు కేంద్రం చేతులెత్తేస్తుండటంతో మిగిలిన పంట పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. మిగిలిన పంటను రైతులు



ఎక్కడ అమ్ముకోవాలనే ప్రశ్నలు ఉత్పత్తి అవుతున్నాయి. బహిరంగ మార్కెట్లో విక్రయిద్దామంటే మద్దతు ధర దక్కే పరిస్థితి లేదు. తప్పని పరిస్థితుల్లో విక్రయించిన రైతులు నష్టాలు మూటగట్టుకుంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతువ్యతిరేక చర్యలతో ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఉత్పత్తుల విక్రయం దైవాధీనంగా మారిందని అన్నారు. పెట్టుబడి పెట్టి పంటలు పండించిన రైతులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. కేంద్ర సహాయ నిరాకరణతో రాష్ట్ర రైతుల కోసం నాడు కేసీఆర్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. కేంద్రం కొనుగోలు చేయని పంటలను రాష్ట్ర ప్రభుత్వం తన సొంత నిధులతో మొత్తం కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చినా, ఇవ్వకపోయినా, కొనుగోలు చేసినా, చేయకపోయినా రైతులు పండించిన మక్కలు, జొన్నలు, కందులు, పెసర్లు, సోయాబీన్, శనగలు, సన్‌ఫ్లవర్ పంటలను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేసింది. ఇందుకోసం ఏకంగా రూ.12వేల కోట్లను ఖర్చు చేసింది. ముఖ్యంగా కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలో బహిరంగ మార్కెట్లో పంటలు కొనుగోలు చేసే దిక్కులేక రైతులు విలవిల్లాడిపోతే రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా అన్ని పంటలను మొత్తం కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచిందని గుర్తు చేశారు. ప్రతిపక్షంలో ఉండగా పంటల కొనుగోళ్లపై కాంగ్రెస్ పార్టీ చేసిన రాద్ధాంతం అంతాఇంతా కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం పంటలు కొనుగోలు చేయకపోతే రాష్ట్రం ప్రభుత్వం ఏం చేస్తుందని, రైతుల పంటలు కొనుగోలు చేసేందుకు కూడా పైసలు లేవా? అంటూ నాటి పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి ప్రశ్నించిన విషయం గుర్తు చేశారు. తాము అధికారంలోకి వస్తే ప్రతి పంటనూ మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని, అంతేకాదు.. మద్దతు ధరకు అదనంగా బోనస్ కూడా చెల్లిస్తామని ప్రకటించారు. తీరా అధికారంలోకి వచ్చిన రెండున్నరేండ్లలోనే పంటల కొనుగోళ్లపై చేతులెత్తేసిందని మండిపడ్డారు. నాడు పదేండ్ల పాటు రైతులకు ఇబ్బందుల్లేకుండా కేసీఆర్ పంటలు కొనుగోలు చేస్తే.. ఇప్పుడు రేవంత్ సర్కార్ రెండున్నరేండ్లకే తమ వల్ల కాదని చేతులెత్తేసిందని అన్నారు. ఉత్పత్తి చేసిన మొత్తం పంటలను కొనుగోలు చేయాలని, లేకుంటే రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

# ఎల్‌నినో ప్రభావంతో మళ్లీ పెరిగిన ఉష్ణోగ్రతలు


## నైతురు ప్రవేశించినా కురియని చినుకులు

## మరో వారంపాటు

## ఇదే పరిస్థితి ఉంటుందన్న ఐఎండి

న్యూఢిల్లీ,

ఎల్‌నినో ప్రభావంతో దేశంలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు పెరుగు తున్నాయి. తెలంగాణలో వచ్చే నాలుగు రోజుల పాటు తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. నైరుతి రుతుపవనాలు దేశంలోని మరిన్ని ప్రాంతాలకు విస్తరిస్తున్నప్పటికీ కనీసం మరో వారం రోజులపాటు విస్తృతమైన వర్షపాతం తక్కువగానే ఉండే అవకాశం ఉంది. జూన్ 23 ప్రాంతంలో పరిస్థితులు మెరుగుపడటం ప్రారంభమయ్యే వరకు వర్షాలు అంతంత మాత్రంగానే ఉంటాయని వాతావరణ పరిస్థితులు సూచిస్తున్నాయి. భారత్‌లోని మధ్య, తూర్పు ప్రాంతాల్లో రుతుపవనాల కదలిక సాంకేతికంగా కొనసాగుతున్నప్పటికీ వర్షాలను కురిపించే ఆ వ్యవస్థ అసాధారణంగా బలహీనంగా ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. జూన్ 15 నుంచి జూన్ 21 మధ్య రుతు పవనాల కార్యకలాపాలు పెద్దగా చురుకుగా ఉండకపోవచ్చని అంచనా. దీనివల్ల దేశంలోని అనేక ప్రాంతాల్లో ఇప్పటికే ఏర్పడిన వర్షపాత లోటు మరింత కొనసాగే అవకాశం ఉంది. రానున్న వారంలో విస్తృతమైన రుతుపవన వర్షాలకు బదులుగా ప్రధానంగా దక్షిణ భారతదేశంలో స్థానిక ఉరుములతో కూడిన వర్షాల ద్వారానే అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు సరిహద్దు ప్రాంతాలు, అలాగే తూర్పు కనుమల్లో తరచుగా ఉరుములతో కూడిన వాతావరణం ఏర్పడే అవకాశం ఉంది. దీనివల్ల అక్కడక్కడ మోస్తరు నుండి భారీ వర్షాలు, మెరుపులు, బలమైన గాలులు సంభవించే అవకాశం ఉంది. ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 9–10 రాష్ట్రాలపై ఎల్‌నినో తీవ్ర ప్రభావం చూపే అవకాశముందని.. ఆ రాష్ట్రాల్లోని జిల్లా అధికారులు, వ్యవసాయ సంస్థలతో సమన్వయ సమావేశాలు నిర్వహించాలని కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆదేశించారు. వర్షపాతం తక్కువగా ఉన్న జిల్లాల కోసం ముందస్తు అత్యవసర ప్రణాళికలు సిద్ధం చేయటం,




పత్తి, పప్పుధాన్యాల సాగు విస్తీర్ణాన్ని పెంచటం, రైతులకు శాస్త్రీయ సలహాలు అందేలా చూడటంపై దృష్టి సారించాలని ఆయన అన్నారు. ఖరీఫ్ 2026 సన్నాహకాలపై మంగళవారం సమీక్ష సమావేశానికి కేంద్ర మంత్రి చౌహాన్ అధ్యక్షత వహించారు. వర్షపాతం తక్కువగా ఉన్న జిల్లాల్లో ముందస్తు అత్యవసర ప్రణాళికల ఆవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు.

# మహిళల పట్ల వైసిపికి గౌరవం లేదు

## అనితను రాజకీయంగా ఎదుర్కోలేక వ్యక్తిత్వ హననం

## జగన్, వైసిపి తీరుపై మండిపడ్డ మంత్రి గొట్టిపాటి

అమరావతి,

మహిళల పట్ల జగన్‌కు, గొడ్డలి పార్టీ నేతలకు ఉన్న గౌరవం ఏపాటిదో రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిందే అని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. హోం మంత్రి అనితను రాజకీయంగా ఎదుర్కోలేకే వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారని విమర్శించారు. ఈ సందర్భంగా మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, వైసీపీపై గొట్టిపాటి రవికుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. గొడ్డలి పార్టీ అధికారంలో ఉన్న ఐదేళ్లు ఆ నేతల బూతులు ప్రజలు వినలేకపోయారని అన్నారు. గత రెండేళ్ల నుంచి రాష్ట్రంలో బూతుల గోల లేదని, ప్రజలు ప్రశాంతంగా ఉంటే ఉనికి చాటుకునేందుకు గొడ్డలి పార్టీ నేతలు యత్నిస్తున్నారని మండిపడ్డారు. మహిళల్ని కించపరిచేలా ఎవరు మాట్లాడినా ఉపేక్షించేది లేదని మంత్రి హెచ్చరించారు. ప్రజలు బుద్ధి చెప్పినా ఇంకా మారడం లేదని, ఇంగితం లేకుండా ప్రవర్తిస్తున్నారని వ్యాఖ్యానించారు. మహిళలపై ద్వేషంతోనే వైసీపీ నేతలు వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. మహిళల పట్ల చులకనగా మాట్లాడే నేతలకు ఈ సమాజంలో స్థానం లేదని గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. కులాల మధ్య చిచ్చు పెట్టడమే జగన్ డీఎన్‌ఏ అని రాజ్యసభ సభ్యులు సానా సతీశ్ వ్యాఖ్యానించారు. తన రాజకీయ పబ్బం కోసం జగన్ కాపులను బలిపశువుల్ని చేయాలని చూస్తే సహించేది లేదన్నారు. అన్నివర్గాల ప్రజలు.. జగన్ కుట్రలను తిరస్కరించి ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా చేసినా మళ్లీ కులాల మధ్య చిచ్చుకు తెరలేపుతున్నారని మండిపడ్డారు. జగన్ కుల చిచ్చులో భాగంగానే గుడివాడ అమర్‌నాథ్ దిగజారేలా హోం మంత్రి అనితపై విమర్శలు చేశారన్నారు. మహిళలంటే జగన్‌కు మొదటి నుంచీ ద్వేషమని.. కన్న తల్లి, సొంత చెల్లిని గెంటేయటమే ఇందుకు నిదర్శనమన్నారు. గుడివాడ అమర్‌నాథ్ బేషరతుగా హోంమంత్రి అనితకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళల పట్ల వైసీపీ నేతల చిన్నచూపుకు ఇది నిదర్శనమమని సతీశ్ అన్నారు. అహంకారంతో మహిళలను అవమానిస్తే సహించబోమన్నారు. మహిళల పట్ల గొడ్డలి పార్టీ వైఖరి ఇలాగే ఉంటే 2029లో ఆ 11 సీట్లు కూడా రావన్నారు. కష్టపడి స్వశక్తితో ఉన్నత స్థానానికి చేరుకున్న అనిత పట్ల ఇటువంటి వ్యాఖ్యలు సిగ్గుచేటన్నారు. మహిళల పట్ల చులకనగా మాట్లాడే నేతలకు ఈ సమాజంలో స్థానం లేదని సానా సతీశ్ తెలిపారు.

# అనితపై వైసిపి నేత గుడివాడ వ్యాఖ్యలు దుర్మార్గం

## మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేసిన పలువురు మహిళా నేతలు

అమరావతి హోంమంత్రి అనితసపై వైసీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వ్యాఖ్యలపై ఏపీ రాష్ట్ర మహిళా కమిషన్‌కు మహిళా నాయకులు ఫిర్యాదు చేశారు. రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితపై గుడివాడ అమర్‌నాథ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్టీఆర్, పల్నాడు జిల్లాలకు చెందిన మహిళా నేతలు.. మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. హోంమంత్రి అనితను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు ఒక మహిళా ప్రజాప్రతినిధి గౌరవాన్ని కించపరిచే విధంగా ఉన్నాయన్నారు. రాజకీయాల్లో విమర్శలు, విధానాలు.. నిర్ణయాలకే పరిమితం కావాలని మహిళల వ్యక్తిత్వం, రూపురేఖలు, వ్యక్తిగత అంశాలను లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు చేయడం సమాజానికి తప్పుడు సందేశాలను పంపుతుందని మహిళా నేతలు తెలిపారు. సమగ్ర విచారణ జరిపి సంబంధిత వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని బహిరంగంగా క్షమాపణ చెప్పేలా చర్యలు తీసుకోవాలని మహిళా కమిషన్‌ను మహిళలు కోరారు. దీనిపై మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డా. రాయపాటి శైలజ స్పందిస్తూ.. మహిళల గౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను కమిషన్ తీవ్రంగా పరిగణిస్తుందన్నారు. అందిన ఫిర్యాదును పరిశీలించి నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకుంటామని శైలజ హామీ ఇచ్చారు.

PRGI NO: TGTEL/25/A5314
అర్జున్ సమాచారం
www.arjunsamaachaaram.in
తెలుగు దినపత్రిక
ఎడిటర్ : లింగం రాజయ్య
బ్యూరో చీఫ్ : గిరవెన రాకేష్

# విద్య, సంక్షేమం, ఉపాధితోనే బీసీల సాధికారత: మంత్రి పొన్నం ప్రభాకర్

తెలంగాణ ప్రభుత్వం వెనుకబడిన తరగతుల విద్యా, ఆర్థిక, సామాజిక అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, సంక్షేమ కార్యక్రమాల ద్వారా బీసీ యువతను సాధికారత కలిగిన వర్గంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రజా భవన్ లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా బీసీ అభివృద్ధి అధికారులు, సహాయ అధికారులు, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్లతో కలిసి శాఖ పనితీరుపై మంత్రి సుదీర్ఘంగా సమీక్షించారు. ప్రతి బీసీ సంక్షేమ వసతి గృహం విద్యార్థుల విద్యా వికాసానికి కేంద్రంగా మారాలని, విద్యార్థుల భద్రత, పోషకాహారం, నాణ్యమైన విద్యపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు. ఇటీవల విడుదలైన 2025–26 విద్యా సంవత్సరపు ఎస్సెస్సీ ఫలితాల్లో బీసీ సంక్షేమ వసతి గృహాల విద్యార్థులు 96.05 శాతం ఉత్తీర్ణత సాధించి, రాష్ట్ర సగటు ఉత్తీర్ణత అయిన 95.15 శాతం కంటే మెరుగైన ఫలితాలు సాధించడం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు. పరీక్షలకు హాజరైన 4,941 మంది విద్యార్థుల్లో 4,746 మంది ఉత్తీర్ణులయ్యారని, రాష్ట్ర వ్యాప్తంగా 285 హాస్టళ్లు వంద శాతం ఫలితాలు సాధించాయని వెల్లడించారు. ఇంటర్మీడియట్ ఫలితాల్లోనూ పలు జిల్లాలు ఉత్తమ ప్రతిభ కనబరిచాయని పేర్కొంటూ, తక్కువ ఫలితాలు సాధించిన జిల్లాల అధికారులపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాలు మరింత పెంచేందుకు ప్రత్యేక శిక్షణ, మెంటరింగ్, మోడల్ పరీక్షలు నిర్వహించాలని, అదనపు సహాయం అవసరమైన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరం విద్యార్థులకు అవసరమైన యూనిఫాం, నోట్ బుక్స్, బెడ్ షీట్లు, ట్రంక్ బాక్స్, షూస్, సాక్స్‌లతో కూడిన సమగ్ర 'వెల్కమ్ కిట్' అందిస్తున్నామని, జూన్ నెలాఖరులోగా అన్ని హాస్టళ్లలో పేరెంట్–టీచర్ సమావేశాలు నిర్వహించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. హాస్టళ్లలో విద్యార్థుల ఆరోగ్యం, భద్రతకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్న మంత్రి, ప్రాంగణాల పరిశుభ్రత, పెస్ట్ కంట్రోల్, ఫాగింగ్, వాటర్ ట్యాంకులు మరియు ఆర్.ఓ ప్లాంట్ల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. నాణ్యమైన బియ్యం, పప్పులు, గుడ్లు, పాలతో కూడిన నిర్దేశిత డైట్ మెనూను కచ్చితంగా అమలు చేయాలని, ప్రతి విద్యార్థికి అకడమిక్, హెల్త్ ప్రొఫైల్స్ రూపొందించి నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ 'సీడ్' పథకం ద్వారా లభించే ప్రయోజనాలపై డీఎన్‌టీ, ఎన్‌టీ, ఎస్ఎన్‌టీ వర్గాలకు అవగాహన కల్పించాలని కోరారు. బీసీ, ఈబీసీ వర్గాలకు సంబంధించిన కల్యాణ లక్ష్మి దరఖాస్తులను తహసీల్దార్, ఆర్డీఓ స్థాయిల్లో పెండింగ్ లేకుండా గ్రీన్ ఛానల్ ద్వారా సకాలంలో పరిష్కరించి లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందేలా చూడాలన్నారు. కుట్టు మిషన్ల పథకం అమలులో జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని, స్థానిక సంస్థల బీసీ ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలపై చర్చించాలని సూచించారు. బోనాల పండుగను పురస్కరించుకుని జూలై 14 నుండి 24 వరకు హెచ్ఎండిఏ గ్రౌండ్స్‌లో కుల వృత్తుల ప్రదర్శన, మట్టి కుండల స్టాల్స్ విస్తృతంగా ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. బీసీ స్టడీ సర్కిళ్లలో మరిన్ని సంస్కరణలు తీసుకువస్తున్నామని, ప్రస్తుతం 12 యూట్యూబ్ ఛానళ్ల ద్వారా పోటీ పరీక్షలకు ఉచిత మార్గదర్శకత్వం అందిస్తూ, ఇయర్ బుక్ మరియు మోటివేషనల్ సాంగ్స్ ద్వారా విద్యార్థుల్లో ప్రేరణ నింపుతున్నామని తెలిపారు. త్వరలోనే సిద్దిపేటలో నూతనంగా నిర్మించిన సొంత బీసీ స్టడీ సర్కిల్ భవనాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12 స్టడీ సర్కిళ్ల ద్వారా యూపీఎస్సీ, గ్రూప్స్, ఎస్ఎస్సీ, బ్యాంకింగ్, ఆర్ఆర్బీ పరీక్షలకు ఉత్తమ ఫాకల్టీతో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు వి. హన్మంతరావు, కమిషనర్ బాలమయదేవి, అధికారులు మల్లయ్య బట్టు, అలోక్ కుమార్, మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.




## సంపాదకీయం...

# కనీస వేతనాలు కాగితాలు దాటాలి!

తెలంగాణ ప్రభుత్వం సుమారు 11 ఏళ్ల తర్వాత కనీస వేతన సవరణ చేపట్టింది. 2023 లో రాష్ట్ర హైకోర్టుకు వచ్చిన ఓ పిల్ మూలంగా ఈ కదలిక వచ్చింది. 2025 లో వచ్చిన కోర్టు ఆదేశాలకు తల వంచి, కమిటీ పేరిట మరో ఏడాది గడిపి చివరకు ప్రభుత్వం 31 మే రోజున దీనికి సంబంధించిన జి ఒ 6 విడుదల చేసింది. ఈ వేతన పెంపును నైపుణ్య ఆధారంగా కార్పొరేషన్, మున్సిపాలిటీ, గ్రామీణ ప్రాంతాల వారీగా మూడు విభాగాలుగా విభజించారు. అన్ని విధాల ఉద్యోగులకు నెలకు 4 నుంచి 5 వేల రూపాయల దాకా వేతనం పెంచబడింది. ఈ కామర్స్, డెలివరీ బాయ్స్ లాంటి కొత్తగా పుట్టుకొచ్చిన ఉద్యోగాలను కూడా దీని పరిధిలోకి తెచ్చారు. ఆడ, మగ తేడా లేకుండా అందరికీ సమానంగా వేతనం చెల్లించాలి. సెలవు రోజుల్లో పనిచేసిన వారికి రెట్టింపు జీతం ఇవ్వాలి. వినియోగదారుల ధర సూచి ఆధారంగా కరువు భత్యాన్ని ఏడాదికి రెండు సార్లు సవరించాలి. అన్ని చెల్లింపులు క్యాష్ రూపంలో కాకుండా బ్యాంకు ఖాతాకు ట్రాన్స్‌ఫర్ చేయాలి. కొత్త వేతనాలు జూన్ 1 నుండి అమలులోకి వస్తాయి. సుమారు కోటి 11 లక్షల మందికి ఈ ప్రయోజనం లభిస్తుందని ప్రభుత్వం అంటోంది. ఈ పనివాళ్ల వేతన చెల్లింపులు, సెలవులు, పని వేళల అమలును ప్రభుత్వ కార్మిక శాఖ పర్యవేక్షిస్తుంది. ఉల్లంఘించిన వారికి జరిమానాలు, శిక్షలు వేసే లేబర్ కోర్టులు ఈ శాఖ ఆధీనంలో ఉంటాయి. విద్యలో విప్లవంతోనే వికసిత భారత్ శ్రామికుల నుండి పని తీసుకొనే యాజమాన్యాలు ప్రభుత్వం సవరించిన వేతనాలను చెల్లించాలి. అయితే ఇది ఆచరణలో విఫలమవుతోంది అని చెప్పడానికి చాలా ఉదాహరణలు ఉన్నాయి. నెలవారీ జీతాలపై పనిచేసే ప్రయివేటు కంపెనీ చిరుద్యోగులు, దుకాణ గుమాస్తాలు, నిర్మాణ రంగ కూలీలు, అపార్ట్‌మెంట్లలో పనిచేసే వాచ్‌మెన్‌లు ఇలా సకల ప్రయివేటు జీతగాళ్లు వారి వారి యజమాని నుండి నెల జీతం తీసుకుంటారు. ఏవో కొన్ని పెద్ద కంపెనీలు తప్ప నలుగురైదుగురు పనివాళ్లను పెట్టుకొనే వ్యాపారులు కనీస వేతన చట్టం గురించి పట్టించుకోరు. పట్టణాల్లో అయితే దీని సంగతి తెలియని వ్యాపారులు, ఉద్యోగులు కూడా ఉండవచ్చు. అప్పుడప్పుడు వచ్చే లేబర్ ఆఫీసర్‌కు దండం పెట్టి ఆయన అడిగిన వాటికి తలూపడం తప్ప ఇంకేమీ ఉండదు. నలుగురు పనివాళ్ళు ఉన్నా హాజరు పట్టిక ఉండదు. జీతాలకు రికార్డు ఉండదు. చాలాసార్లు లేబర్ ఆఫీసర్ తనిఖీ ముందే తెలియడంతో ఊర్లో దుకాణదారులందరూ గుమాస్తాలను బయటికి పంపిస్తారు. ఒంటిగానే దుకాణం నడుపుకుంటాను అని యజమాని చెప్పడంతో తనిఖీ సక్సెస్ అవుతుంది. నగరాల్లో ప్రయివేటు ఉద్యోగుల్లో చాలా వరకు అవుట్ సోర్సింగ్ ద్వారా నియామకం పొందినవారే. సెక్యూరిటీగా పని చేసేవారికి యాజమాన్యాలు ఇచ్చే మొత్తంలో కనీసం 10% అవుట్ సోర్సింగ్ కంపెనీ తీసుకుంటుంది. సవరించిన చట్టం ప్రకారం అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలు వారి కమిషన్ ను అదనంగా వసూలు చేసి ఉద్యోగికి మాత్రం చట్టప్రకారం చెల్లించాలి. ఆ భారం పని తీసుకొనే యాజమాన్యాలపై పడుతుంది. మేమెందుకు ఎక్కువ ఇవ్వాలి అని వారంటే కమిషన్ రూపంలో కొంత మొత్తాన్ని ఉద్యోగి నష్టపోవలసిందే. చాలా చోట్ల పనివాళ్లు సంతకం చేసిన మొత్తానికి చెల్లించే సొమ్ముకు వ్యత్యాసం ఉంటుంది. రికార్డుల్లో ఎక్కువ చూపించి చేతికి తక్కువ ఇచ్చే సంస్థలు ఎన్నో ఉన్నాయి. ప్రైవేటు విద్య, వైద్య సంస్థల్లో ఉద్యోగులకు ఎక్కువ మొత్తానికి చెక్ ఇచ్చి లేదా ట్రాన్స్‌ఫర్ చేసి, తిరిగి ఉద్యోగి నుంచి కొంత సొమ్మును క్యాష్ రూపంలో వెనక్కి తీసుకుంటారు. దాంతో యాజమాన్యాలకు బ్లాక్ మనీ దక్కడంతో పాటు ఇన్‌కమ్ టాక్స్ తగ్గుతుంది. ఎవరి అవసరాలు వారివి అన్నట్లు డాక్టర్లు, ప్రొఫెసర్లు సైతం సహకరిస్తుంటారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన గ్రామీణ బ్యాంకుల్లో టెంపరరీ పార్ట్ టైం స్వీపర్ల పేరిట అటెండర్లు ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్నారు.

అర్జున్ సమాచారం
www.arjunsamaachaaram.in
తెలుగు దినపత్రిక

## ఆట





# అఫ్ఘాన్‌పై భారత్ భారీ స్కోరు..!

అఫ్ఘానిస్థాన్‌తో లక్నోలో జరుగుతున్న రెండో వన్డేలో భారత్ బ్యాటింగ్‌లో రెచ్చిపోయింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (154), ఇషాన్ కిషన్ అద్భుత సెంచరీలతో కదంతొక్కడంతో టీమిండియా 49.5 ఓవర్లలో 402 పరుగుల భారీ స్కోరు సాధించింది. రోహిత్ శర్మ 48 పరుగులతో రాణించగా, యశస్వి జైస్వాల్ (4) నిరాశపరిచాడు. ఇషాన్ కిషన్ ఆఖరిలో టీ20 తరహాలో బ్యాటింగ్ చేసి సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. అఫ్ఘాన్ బౌలర్లలో నంగియాలై కరోటే 4 వికెట్లు పడగొట్టాడు. అఫ్ఘానిస్థాన్‌తో జరుగుతున్న రెండో వన్డేలో భారత్ భారీ స్కోరు చేసింది. లక్నో వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన అఫ్ఘానిస్థాన్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. దీంతో టీమిండియా ఫస్ట్ బ్యాటింగ్‌కు దిగింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్, ఇషాన్ కిషన్ సెంచరీలతో భారత్.. భారీ స్కోరు చేసింది. 49.5 ఓవర్లలో 402 పరుగులకు ఆలౌట్ అయింది.



# మహిళల విశ్వరూపం

మహిళల టీ20 క్రికెట్ ప్రపంచకప్‌లో పరుగుల సునామీ కురుస్తోంది. మైదానంలోకి దిగితే చాలు సిక్సర్లు, ఫోర్ల వర్షంతో బ్యాటర్లు స్టేడియాలను హోరెత్తిస్తున్నారు. తాజాగా ఇంగ్లాండ్, భారత్ జట్లు సృష్టించిన సునామీతో ఐసీసీ ఉమెన్స్ టీ20 వరల్డ్ కప్ చరిత్రలోనే అత్యధిక స్కోర్ల రికార్డులు మారిపోతున్నాయి. మహిళల టీ20 ప్రపంచకప్ చరిత్రలో అత్యధిక స్కోరు సాధించిన జట్టుగా ఇంగ్లాండ్ ఉమెన్స్ టీమ్ సరికొత్త రికార్డు సృష్టించింది. 2026 జూన్ 12న బర్మింగ్‌హామ్ వేదికగా శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లాండ్ బ్యాటర్లు లంక బౌలర్లను ముప్పుతిప్పలు పెట్టారు. నిర్ణీత 20 ఓవర్లలో కేవలం ఒకే ఒక్క వికెట్ కోల్పోయి ఏకంగా 219 పరుగుల భారీ స్కోరు సాధించారు. ఓవర్ కి 10.95 రన్ రేట్‌తో సాగిన ఈ ఇన్నింగ్స్ ఉమెన్స్ క్రికెట్ హిస్టరీలోనే ఒక మైలురాయిగా నిలిచిపోయింది. బౌండరీల వర్షం కురిపించిన ఇంగ్లాండ్ టీమ్, ఆ మ్యాచ్‌లో ఘనవిజయం సాధించి చరిత్ర పుటల్లోకెక్కింది. కేవలం ఈ ఏడాదే కాదు, గతంలోనూ ఇంగ్లాండ్ జట్టు ఇలాంటి పరుగుల విధ్వంసాన్నే సృష్టించింది. ఈ జాబితాలో రెండో స్థానం కూడా ఇంగ్లాండ్ ఖాతాలోనే ఉంది. 2023 ఫిబ్రవరి 21న కేప్ టౌన్ వేదికగా పాకిస్తాన్‌తో జరిగిన వరల్డ్ కప్ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ మహిళల జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసింది. పాక్ బౌలింగ్‌ను చీల్చిచెండాడుతూ 10.65 రన్ రేట్‌తో ఈ స్కోరును నమోదు చేశారు. ఈ మ్యాచ్‌లోనూ ఇంగ్లాండ్ ఘన విజయాన్ని అందుకుంది. ఇక తాజాగా లీడ్స్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో భారత మహిళల జట్టు సరికొత్త రికార్డును తన పేరిట లిఖించుకుంది. నెదర్లాండ్స్ జట్టుతో జరిగిన ఉత్కంఠభరిత పోరులో టీమిండియా బ్యాటర్లు చెలరేగి ఆడారు.

# సెనెగల్‌పై ఫ్రాన్స్ ఘన విజయం

ఫిఫా వరల్డ్ కప్ 2026 గ్రూప్ దశలో భాగంగా న్యూజెర్సీ వేదికగా జరిగిన పోరులో ఫ్రాన్స్ 3–1 తేడాతో సెనెగల్‌పై ఘన విజయాన్ని నమోదు చేసింది. ఈ మ్యాచ్‌లో రెండు అద్భుతమైన గోల్స్‌తో మెరిసిన ఎంబాపె, జట్టును గెలిపించడమే కాకుండా ఫుట్‌బాల్ దిగ్గజాల రికార్డులను తిరగరాస్తూ సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఫస్టాఫ్‌లో సెనెగల్ జట్టు ఫ్రాన్స్‌కు గట్టి సవాలు విసిరింది. కానీ, సెకండాఫ్‌లో ఎంబాపె వ్యూహంతో ఫ్రాన్స్‌ను విజయం వరించింది. సెనెగల్ జట్టు చాలా పక్కా ప్రణాళికతో బరిలోకి దిగింది. ఫ్రాన్స్ కెప్టెన్ కిలియన్ ఎంబాపెను కట్టడి చేయడమే లక్ష్యంగా ఆడింది. ఫలితంగా ఫస్టాఫ్ ముగిసేసరికి ఎంబాపె కేవలం 14 సార్లు మాత్రమే బంతిని తాకగలిగాడు. దీనితో మొదటి 45 నిమిషాల ఆట ఒక గోల్ నమోదు కాకుండానే ముగిసింది. ఇక సెకండాఫ్‌లో ఫ్రాన్స్ జట్టు పక్కా వ్యూహంతో మైదానంలోకి అడుగుపెట్టింది. ఎంబాపె ఒక్కసారిగా తన వేగాన్ని పెంచాడు. 66వ నిమిషంలో జూల్స్ కౌండే నుంచి అందిన ఒక అద్భుతమైన త్రూ–బాల్‌ను ఎంబాపె ఆధీనంలోకి తీసుకున్నాడు. అంతవరకు పెనాల్టీ బాక్స్‌లో బంతిని నియంత్రించడానికి ఇబ్బంది పడిన ఎంబాపె ఈసారి మాత్రం ఎలాంటి పొరపాటు చేయలేదు. అత్యంత చాకచక్యంగా బంతిని గోల్ పోస్ట్‌లోకి పంపి ఫ్రాన్స్‌కు 1–0 ఆధిక్యాన్ని అందించాడు. తొలి గోల్ వచ్చిన ఉత్సాహంలో ఫ్రాన్స్ మరింత దూకుడు పెంచింది. కొద్దిసేపటికే బ్రాడ్లీ బార్కోలా మరో గోల్ సాధించాడు. దీంతో ఫ్రాన్స్ ఆధిక్యం 2–0కు చేరింది. మ్యాచ్ దాదాపు ముగింపునకు వచ్చేసింది అనుకుంటున్న తరుణంలో, ఇంజూరీ టైమ్‌లో సెనెగల్ ప్లేయర్ గోల్‌గా మలిచాడు. దీంతో స్కోరు 2–1 గా మారి మ్యాచ్‌లో ఒక్కసారిగా ఉత్కంఠ పెరిగింది. దీంతో ఆ మ్యాచ్ డ్రా అవుతుందేమోనన్న ఆందోళనలో ఫ్రాన్స్ అభిమానులు ఉన్నారు. అయితే సెనెగల్ ఆనందం ఎక్కువ సేపు నిలవలేదు. ఫ్రాన్స్ ఎదురుదాడికి దిగింది. ఎంబాపె కొట్టిన లాంగ్–రేంజ్ షాట్ నెట్‌లోకి దూసుకెళ్లింది. ఈ అద్భుతమైన గోల్‌తో ఫ్రాన్స్ 3–1తో విజయాన్ని ఖరారు చేసుకుంది.

# పౌర సేవలు, యుటిలిటీ బిల్లుల చెల్లింపుల కోసం సరికొత్త ఏకీకృత డిజిటల్ ప్లాట్‌ఫారమ్ 'క్యూర్-1' ను ప్రారంభించిన తెలంగాణ ప్రభుత్వం

తెలంగాణ ప్రభుత్వం డిజిటల్ గవర్నెన్స్ సంస్కరణల్లో భాగంగా పౌరులకు మరింత సులభంగా, పారదర్శకంగా సేవలు అందించేందుకు సరికొత్త నిర్ణయం తీసుకుంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పౌర సేవలు మరియు వివిధ యుటిలిటీ బిల్లుల చెల్లింపుల కోసం "క్యూర్-1" (కామన్ యూనిఫైడ్ బిల్లింగ్ అండ్ కలెక్షన్ సిస్టమ్) పేరుతో ఒకే ఒక ఏకీకృత డిజిటల్ పేమెంట్ ప్లాట్‌ఫారమ్‌ను మరియు ప్రత్యేక యాప్‌ను తీసుకువస్తూ ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ మరియు అర్బన్ డెవలప్‌మెంట్ విభాగం దీనికి సంబంధించిన ఉత్తర్వులను (జీవో నంబర్ 627) విడుదల చేసింది. ఈ నూతన వ్యవస్థ సమర్థవంతమైన నిర్వహణ, అమలు మరియు పర్యవేక్షణ కోసం ప్రభుత్వం ఒక ఉన్నత స్థాయి స్టీరింగ్ కమిటీని కూడా ఏర్పాటు చేసింది.ప్రస్తుతం పౌరులు ఆస్తి పన్ను, విద్యుత్ బిల్లులు, తాగునీటి సరఫరా ఛార్జీలు, ట్రేడ్ లైసెన్సులు మరియు ట్రాఫిక్ చలాన్లు వంటి వివిధ ప్రభుత్వ బకాయిలను చెల్లించడానికి వేర్వేరు పోర్టల్‌లను ఉపయోగించాల్సి వస్తోంది. దీనివల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించి, అన్ని రకాల ప్రభుత్వ శాఖల చెల్లింపులను ఒకే వేదికపైకి తీసుకురావడమే ఈ సరికొత్త ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. ప్రాథమికంగా ఈ విధానాన్ని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ), సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ), మరియు మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) పరిధిలో అమలు చేయనున్నారు. ఈ ప్లాట్‌ఫారమ్ ద్వారా పైన పేర్కొన్న మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలోని పన్నులతో పాటు టీజీఎస్పీడీసీఎల్ విద్యుత్ బిల్లులు,హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ నీటి సరఫరా ఛార్జీలు, మరియు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసుల చలాన్లను సులభంగా చెల్లించవచ్చు.ఈ ప్రతిష్ఠాత్మక క్యూర్-1 డిజిటల్ ప్లాట్‌ఫారమ్ రూపకల్పన, సాంకేతిక అభివృద్ధి మరియు నిర్వహణ బాధ్యతలను హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) సంస్థకు ప్రభుత్వం అప్పగించింది. వెబ్ మరియు మొబైల్ ప్లాట్‌ఫారమ్‌ల అభివృద్ధి, భద్రత, సైబర్ సెక్యూరిటీ ప్రమాణాలు మరియు రియల్ టైమ్ మానిటరింగ్ సిస్టమ్స్ వంటి సాంకేతిక అంశాలను సీజీజీ చూసుకుంటుంది. అదేవిధంగా, ఈ ప్రాజెక్ట్ సమన్వయకర్తగా మరియు నోడల్ ఏజెన్సీగా 'ఈఎస్‌డీ మీ-సేవ' వ్యవహరించనుంది. మీ-సేవ డైరెక్టర్ దీనికి నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తూ పేమెంట్ గేట్‌వేల అనుసంధానం, రోజువారీ నిధుల సర్దుబాటు మరియు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా చెల్లింపుల ప్రక్రియ సురక్షితంగా జరిగేలా పర్యవేక్షిస్తారు. పౌరుల ఆర్థిక లావాదేవీలు మరియు వ్యక్తిగత డేటా భద్రత కోసం ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్ విధానాన్ని అమలు చేయనున్నారు.ఈ ప్రాజెక్టుకు వ్యూహాత్మక దిశా నిర్దేశం చేయడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి స్టీరింగ్ కమిటీకి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ మరియు అర్బన్ డెవలప్‌మెంట్ (ఎంఏ అండ్ యూడీ) శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. మీ-సేవ డైరెక్టర్ కన్వీనర్‌గా, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ కో-కన్వీనర్‌గా ఉంటారు. వీరితో పాటు జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీ కమిషనర్లు, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ఎండీ మరియు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ కమిషనర్ తదితరులు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ ప్రతి నెలా సమావేశమై ప్లాట్‌ఫారమ్ పురోగతిని సమీక్షిస్తుంది. ఈ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అయిన 90 రోజుల్లోగా సంబంధిత అన్ని ప్రభుత్వ శాఖలు మరియు సంస్థలు తమ పాత విడివిడి చెల్లింపు వ్యవస్థలను పూర్తిగా నిలిపివేసి, ఈ సరికొత్త క్యూర్-1 ఏకీకృత చెల్లింపు విధానంలోకి మారాలని ప్రభుత్వం స్పష్టమైన గడువును విధించింది.

## చిట్టీల వ్యాపారం నిర్వహిస్తున్న గవర్నమెంట్ టీచర్‌పై సస్పెన్షన్ వేటు

చిట్టీల వ్యాపారం నిర్వహిస్తున్న గవర్నమెంట్ టీచర్‌పై వేటుపడింది. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి జడ్పీ పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కలువల ఎల్లయ్యను సస్పెండ్ చేశారు. ఈ మేరకు డీఈవో గిరిరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు.ప్రభుత్వ ఉద్యోగ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు చిట్టీల వ్యాపారం నిర్వహిస్తూ, మోసాలకు పాల్పడుతున్నాడని ఇటీవల కలువల ఎల్లయ్యపై ఫిర్యాదులు వచ్చాయి. ఈ ఆరోపణలపై విచారణ కోసం కలెక్టర్ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీ జరిపిన ప్రాథమిక విచారణలో నేరం రుజువు కావడంతో డీఈవో సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు.

## మానవత్వం చాటుకున్న ప్రముఖ సినీ నిర్మాత బండ్ల గణేష్



ప్రముఖ చలనచిత్ర నిర్మాత బండ్ల గణేష్ తన ఉదారతతో మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. హనుమకొండలో అరుదైన ఆరోగ్య సమస్యతో బాధపడుతున్న నిరంజన్ అనే చిన్నారిని ఆయన శనివారం పరామర్శించారు. బాలుడి నివాసానికి స్వయంగా వెళ్లిన బండ్ల గణేష్, ఆ కుటుంబ పరిస్థితులను మరియు బాలుడి ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం, గతంలో ఆ కుటుంబానికి ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ, బాలుడి వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 5 లక్షల ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా బండ్ల గణేష్ మాట్లాడుతూ, అరుదైన వ్యాధితో పోరాడుతున్న చిన్నారి నిరంజన్ త్వరగా కోలుకుని పూర్తి ఆరోగ్యంతో తిరిగి రావాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. నిరంజన్ కుటుంబ సభ్యులకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని, భవిష్యత్తులో ఎలాంటి అవసరం వచ్చినా సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన భరోసా ఇచ్చారు. కష్టాల్లో ఉన్న ఒక కుటుంబానికి స్వయంగా వచ్చి ఆర్థిక సాయం అందించడమే కాకుండా, వారికి కొండంత అండగా నిలిచిన బండ్ల గణేష్‌పై స్థానికులు మరియు బాలుడి కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఇసుక మాఫియా బెదిరింపులపై బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు

అక్రమ ఇసుక రవాణాను అడ్డుకుంటే అంతుచూస్తామని బెదిరించిన ఇసుక మాఫియా పై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు కృష్ణా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ యువ నాయకులు శివరాజ్ పటేల్ మీడియాతో మాట్లాడుతూ కృష్ణా మండలంలోని గురుజాల్, వాసునగర్, టైరోడ్ మూడుమాల్ సమీపంలోని కృష్ణానదిలో రాత్రి



వేళల్లో అక్రమంగా పెద్ద ఎత్తున ఇసుక తరలింపు నిత్యం జోరుగా కొనసాగుతుందని ఆరోపించారు. కొంత మంది అధికారుల అండదండలతో ఈ వ్యవహారం కొనసాగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఓ మంత్రి అండదండలతో నిత్యం 50 నుంచి 100 ట్రిప్పర్ల ద్వారా అక్రమంగా ఇసుక కర్ణాటకకు తరలిస్తున్నారని ఫిర్యాదు చేశారు. అక్రమ ఇసుకను అడ్డుకున్న వారిని ఇసుక మాఫియా బెదిరించడంతో పాటు భౌతిక దాడులకు పాల్పడుతుందని ఆరోపించారు. బెదిరింపులకు పాల్పడిన వ్యక్తులపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కి కూడా ఫిర్యాదు చేశామని శివరాజ్ పటేల్ వెల్లడించారు.

## ప్రైవేట్ స్కూళ్లల్లో ఫీజులను నియంత్రించాలి

ప్రైవేట్ స్కూళ్లల్లో ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ శనివారం తుంగతుర్తి మండల కేంద్రంలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో నాయకులు ఎంఈఓ బోయిని లింగయ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ నియోజకవర్గ నాయకులు తడకమళ్ల రవికుమార్, గునిగంటి సంతోష్ గౌడ్ మాట్లాడుతూ.. మధ్యతరగతి, పేద విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక ఉపశమనం కలిగించడమే లక్ష్యంగా ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణకు తమిళనాడు తరహాలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చింతకుంట్ల మనోజ్, గోపగాని రమేష్ గౌడ్, బొజ్జ సాయికిరణ్, కొండగడుపుల వెంకటేష్, కొండగడుపుల శ్రీకాంత్,



తడకమళ్ల మధు పాల్గొన్నారు.

# ఇది ప్రజా పాలన కాదు.. ప్రజలను హింసించే రాక్షస పరిపాలన: ఎమ్మెల్యే వివేకానంద



కాంగ్రెస్ ప్రభుత్వం పేరుకే ప్రజాపాలన సాగిస్తోందని, వాస్తవానికి ఇది ప్రజలను నానాయాతన పెట్టే హింసాత్మక పాలనని కుత్బుల్లాపూర్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం హైదరాబాద్ చింతల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాక్షస పాలన సాగుతోందని, అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తూ రాష్ట్రాన్ని పూర్తిగా అధోగతి పాలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. గత పదేళ్ల కేసీఆర్ పాలన తెలంగాణ వ్యవసాయ రంగానికి ఒక స్వర్ణయుగమని, అప్పట్లో రైతులను కంటికి రెప్పలా కాపాడుకుంటూ కడుపులో పెట్టుకుని చూసుకున్నారని కొనియాడారు. సకాలంలో విత్తనాలు, యూరియా అందించడమే కాకుండా, సమయానికి రైతుబంధు నిధులను నేరుగా రైతుల ఖాతాల్లో వేసి, పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేసి అన్నదాతకు అండగా నిలిచారని గుర్తుచేశారు. కానీ నేడు రేవంత్ రెడ్డి అసమర్థ పరిపాలన వల్ల రైతులంతా తీవ్ర హింసను అనుభవిస్తున్నారని, విత్తనాలు, యూరియా కోసం రోడ్లపై పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుబంధు పేరును రైతుభరోసాగా మార్చిన ఈ ప్రభుత్వం, ఇప్పటివరకు ఒక్క రైతు ఖాతాలోనూ ఆ నిధులను జమ చేయకుండా అన్నదాతలను ఘోరంగా వంచించిందని ఆరోపించారు. సంపూర్ణ రుణమాఫీ చేస్తామని నమ్మబలికిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగాన్ని పూర్తిగా ముంచిందని కేపీ వివేకానంద మండిపడ్డారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని బోరంపేట పీఏసీఎస్ పరిధిలో ఉన్న 632 మంది రైతుల్లో కేవలం 13 మందికి మాత్రమే రుణమాఫీ కావడం దీనికి నిదర్శనమని, రుణమాఫీ విషయంలో ముఖ్యమంత్రి ఒక గజదొంగలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గతంలో పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో కేంద్రం వద్ద కొనకపోతే కిషన్ రెడ్డి ఇంటి ముందు పోస్తానని శపథం చేసిన రేవంత్ రెడ్డి, నేడు ముఖ్యమంత్రి అయ్యాక ప్రధానమంత్రి మోదీకి పూర్తిగా సరెండర్ అయ్యారని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి చేతగానితనాన్ని, డొల్లతనాన్ని ఆయన చేస్తోన్న ప్రకటనలే స్వయంగా బయట పెడుతున్నాయన్నారు. మూసీ ప్రక్షాళన, మెట్రో రైలు విస్తరణ ఫోర్త్ సిటీ, కాళేశ్వరం రిపేర్లు ఇలా ప్రతి అంశంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, తమ వైఫల్యాలను కప్పిపుచ్చు కోవడానికే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులపై నిరంతరం దుమ్మెత్తిపోస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ చేస్తున్న మోసాలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే ఈ చేతగాని ప్రభుత్వాన్ని గద్దె దించడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. రైతాంగానికి చేసిన మోసానికి కాంగ్రెస్ ప్రభుత్వం ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని, తక్షణమే రైతు బీమా ప్రీమియం చెల్లించడంతో పాటు రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేలను రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అసెంబ్లీ వేదికగానే కాకుండా రోడ్లపైకి వచ్చి పెద్ద ఎత్తున ప్రజా పోరాటాలు చేస్తామని, ప్రభుత్వం మెడలు వంచైనా రైతుల హక్కులను సాధించుకుంటామని కేపీ వివేకానంద స్పష్టం చేశారు.

# ల్యాండ్ రికార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ నరహరి అక్రమాస్తుల గుట్టురట్టు

## లాకర్లలో రూ. 1.50 కోట్ల నగదు లభ్యం, మొత్తం ఆస్తుల విలువ రూ. 180 కోట్లకు పైనే!

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ల్యాండ్ రికార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి రావు అక్రమాల పర్వం ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తోంది. ఏసీబీ అధికారులు శనివారం నిర్వహించిన సోదాల్లో సంచలన విషయాలు బయటపడ్డాయి. శాలిబండలోని కెనరా బ్యాంకులో ఉన్న నరహరి భార్య పేరిట గల లాకర్లను ఓపెన్ చేయగా, అందులో కట్టల కట్టలుగా దాచిన రూ. 1.50 కోట్ల నగదు లభ్యమైంది. అధికారులు ఈ నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇంకా మరో రెండు లాకర్లను తెరవాల్సి ఉందని ఏసీబీ అధికారులు వెల్లడించారు.

### భారీగా పట్టుబడిన నగదు, బంగారం, డిపాజిట్లు

ఇప్పటికే నరహరి ఇంట్లో జరిపిన సోదాల్లో రూ. 1.54 కోట్ల నగదుతో పాటు 1.3 కిలోల బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. వీటితో పాటు బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ. 2.29 కోట్ల బ్యాలెన్స్, రూ. 5.04 కోట్ల ఫిక్స్డ్ డిపాజిట్లను కూడా ఏసీబీ అధికారులు ఫ్రీజ్ చేశారు. సైబరాబాద్ పరిధిలోని కీలక ప్రాంతాల్లో భవనాలు, అపార్ట్‌మెంట్లు, ఓపెన్ ప్లాట్లకు సంబంధించిన డాక్యుమెంట్లను అధికారులు కనుగొన్నారు. ఆస్ట్రేలియాలో ఉంటున్న ఆయన కుమారుడు, అలాగే అత్తమామల పేరిట రిజిస్ట్రేషన్ చేసిన ఆస్తుల పత్రాలను, ఒక కారును కూడా స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం మార్కెట్ విలువ ప్రకారం నరహరి కూడబెట్టిన ఈ అక్రమాస్తుల విలువ సుమారు రూ. 180 కోట్లకు పైగా ఉంటుందని ఏసీబీ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో నరహరిని అరెస్ట్ చేసి, ఏసీబీ స్పెషల్ కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించింది.

### కోట్లలో స్థిరాస్తుల సామ్రాజ్యం

నరహరి సంపాదించిన స్థిరాస్తుల వివరాలను పరిశీలిస్తే ఆయన అక్రమ సంపాదన ఏ స్థాయిలో సాగిందో అర్థమవుతుంది. పాతబస్తీ ఛత్రినాకలో ఒక ఇల్లు, గచ్చిబౌలి టీఎన్జీవో కాలనీలో ఒక బిల్డింగ్ ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా పరిధిలో ఐదు ఓపెన్ ప్లాట్లు, మహేశ్వరంలో 1.24 ఎకరాల వ్యవసాయ భూమిని ఆయన కొనుగోలు చేశారు. వీటితో పాటు పుప్పాలగూడలో 2,500 చదరపు అడుగుల విస్తీర్ణం గల ఒక హైరైజ్ బిల్డింగ్ ఫ్లాట్, నార్సింగిలో ఒక్కొక్కటి 1,860 చదరపు అడుగుల విస్తీర్ణంతో ఉన్న రెండు హైరైజ్ బిల్డింగ్ ఫ్లాట్లు, రాజేంద్రనగర్‌లో ఒక రెసిడెన్షియల్ ఫ్లాట్ ఉన్నట్లు సోదాల్లో తేలింది.

### కారుణ్య నియామకం నుండి అవినీతి తిమింగలం వరకు

సుంకరి నరహరి రావు నేపథ్యం చూస్తే, ఆయన తండ్రి యాదవ్ రావు నారాయణగూడలోని సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ విభాగంలో కంప్యూటర్ డ్రాఫ్ట్‌మ్యాన్‌గా పనిచేసేవారు. 1984 డిసెంబర్‌లో తండ్రి మరణించడంతో, అప్పటికే ఇంటర్ చదువుతున్న నరహరిరావుకు 1987 సెప్టెంబర్‌లో కారుణ్య నియామకం కింద ఉద్యోగం లభించింది. ఆ తర్వాత రంగారెడ్డి జిల్లా ల్యాండ్ రికార్డ్స్ ఆఫీస్‌లో డిప్యూటీ సర్వేయర్‌గా పదోన్నతి పొంది, 2001 వరకు అక్కడే పనిచేశారు. అనంతరం హైదరాబాద్‌లో సర్వేయర్‌గా, అర్బన్ ల్యాండ్ సీలింగ్ ఆఫీస్‌లో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్‌గా, మహబూబ్‌నగర్, వరంగల్‌లలో 2013 వరకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు.

గత ఏడాది ఆగస్టులో ఆయన మల్టీజోన్ 2 డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి పొందారు. ప్రభుత్వ, ప్రైవేట్ భూముల సర్వేల విషయంలో నరహరిపై తీవ్ర అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా ఇటీవల జరిగిన భూముల అమ్మకాల సర్వేల్లో భారీగా అక్రమాలకు పాల్పడి పెద్ద ఎత్తున లంచాలు వసూలు చేసినట్లు ఏసీబీకి అందిన పక్కా సమాచారంతోనే ఈ దాడులు జరిగాయి.





# విజిలెన్స్ ఏసీబీ అధికారుల తనిఖీ




**అర్జున్ సమాచారం జూన్ 20జగిత్యాల. ప్రతినిధి ::**

జగిత్యాల పట్టణ మున్సిపల్ కార్యాలయంలో గత కొన్ని రోజుల క్రింతం విజిలెన్స్, ఏసీబీ అధికారుల తనిఖీలు..తాజా నివేదిక ఆధారంగా మున్సిపల్ కార్యాలయంలో పని చేస్తున్న సీనియర్, జూనియర్ తదితర 10 మందికి ఏసీబీ అధికారుల నోటీసులు..శనివారం ఉదయం కరీంనగర్ లోని ఏసీబీ కార్యాలయంలో 10 గంటలు కు హాజరు కావాలని ఆదేశాలు..జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు నోటీసులపై ఉద్యోగుల్లో ఆందోళన.ఎవరిపై వేటు పడేనోనని చర్చలు..

# సీఎం సహాయ నిది చెక్కులు పంపిని



**అర్జున్ సమాచారం జూన్ 20**

జగిత్యాల. ప్రతినిధి ::రాయికల్ పట్టణ గుడేటి రెడ్డి సంఘం లో రాయికల్ పట్టణ మండలానికి చెందిన 40 మందికి సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన 12 లక్షల 60 వేల రూపాయల విలువగల చెక్కులను,17 మంది ఆడబిడ్డలకు కళ్యాణ లక్ష్మీ షాది ముభారక్ పథకం ద్వారా మంజూరైన 17 లక్షల రూపాయలు విలువగల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్.ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మెన్ కాటిపెల్లి గంగారెడ్డి మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు,వైస్ చైర్మన్ రమాదేవి నాయకులు రవీందర్ రావు కోల శ్రీనివాస్ సురేందర్ నాయక్ కౌన్సిలర్ గంగాధర్ , సర్పంచులు కౌన్సిలర్ లు కో ఆప్షన్ సభ్యులు అధికారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీల హక్కులపై కేంద్ర విధానాల ప్రభావం : తాండూరులో కార్మికుల ఆందోళన

**అర్జున్ సమాచారం జూన్ 20మంచిర్యాల.ప్రతినిధి:**

తాండూర్ మండలంలోని తాండూర్ గ్రామపంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల వద్ద వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ నాయకులు శనివారం పర్యటించి కూలీల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూలీలతో సమావేశమై వారి ఇబ్బందులను విన్నారు.సీఐటీయూ సహాయ కార్యదర్శి దాగం రాజారాం మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి బదులుగా కొత్త విధానాన్ని అమలు చేయాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. ఇప్పటికే అమలులో ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.కొత్త విధానం వల్ల ఉపాధి కూలీలు, క్షేత్ర సహాయకులకు నష్టం కలిగే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. కూలీలకు లభించే వేతనాల విషయంలో కేంద్రం తన వాటాను తగ్గించి రాష్ట్రాలపై అదనపు భారం మోపాలని చూస్తోందని విమర్శించారు. కూలీల సంక్షేమానికి ఉపయోగపడే నిబంధనలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉన్నప్పటికీ వాటిని బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.ఉపాధి పనుల హాజరు నమోదులో అమలవుతున్న చిత్రీకరణ విధానం కూలీలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందన్నారు. పనికి వచ్చిన సమయంలో ఒకసారి, పని ముగిసిన తర్వాత మరోసారి చిత్రాలు నమోదు చేయాల్సి రావడం వల్ల అడవులు, సిగ్నల్ సమస్యలు ఉన్న ప్రాంతాల్లో గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని తెలిపారు. పని ముగిసిన తర్వాత చిత్రీకరణ తప్పనిసరి నిబంధనను రద్దు చేయాలని కోరారు.కూలీలకు వేసవి భత్యం, రాకపోకల ఖర్చులు, అవసరమైన పనిముట్లు, స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పని కోరిన వారానికి లోపల ఉపాధి కల్పించకపోతే నిరుద్యోగ భృతి చెల్లించాలని కోరారు. పని ప్రదేశాల్లో నీడ కోసం గుడారాలు ఏర్పాటు చేయడంతో పాటు చిన్నారుల



సంరక్షణ కోసం ఆయాలను నియమించాలని సూచించారు. ప్రాథమిక చికిత్స పెట్టెలు అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో దుర్గం భాగ్య, దాగం సుమ, సప్న, రాజేశం, మంగ, జంశెట్టి రవీందర్, దుర్గం సంగీత, లింగాల లక్ష్మి, రాజమ్మ, ఇప్ప రేవతి, సురుపత్తుల నందు, మోత్కుల రమేష్, తాండూర్ మండల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా మోదీ 12 ఏళ్ల పాలన: డా. కె. లక్ష్మణ్ వెల్లడి





ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో గత పన్నెండు సంవత్సరాలుగా దేశం సంక్షేమం, మౌలిక సదుపాయాల కల్పన, మహిళా సాధికారత రంగాలలో చరిత్రాత్మక పురోగతిని సాధించిందని రాజ్యసభ సభ్యులు డా. కె. లక్ష్మణ్ కొనియాడారు. హైదరాబాద్ కవాడిగూడలో పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ) శనివారం నిర్వహించిన 'వార్త' మీడియా ఇంటరాక్షన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన, పీఎం స్వనిధి, ముద్రా యోజన, ఉజ్వల పథకం, ఆయుష్మాన్ భారత్, జన్ ధన్ వంటి పథకాలు దేశంలోని పేదలు, సామాజికంగా వెనుకబడిన వర్గాల జీవన ప్రమాణాలను గణనీయంగా మెరుగుపరిచాయని ఆయన స్పష్టం చేశారు.ఈ దశాబ్ద కాలంలో ఉజ్వల పథకం ద్వారా 11 కోట్లకు పైగా మహిళలు లబ్ధి పొందారని, స్వచ్ఛ భారత్ మిషన్ కింద కోట్లాది ఇళ్లకు మరుగుదొడ్లు నిర్మించడం వల్ల మహిళల ఆత్మగౌరవం, భద్రత పెరిగాయని డా. లక్ష్మణ్ పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద సంక్షేమ కార్యక్రమంగా నిలిచిన 81 కోట్ల మందికి ఉచిత ఆహార ధాన్యాల పంపిణీ, ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య భద్రతను ఆయన ప్రస్తావించారు. జన్ ధన్–ఆధార్–మొబైల్ (జామ్) త్రివేణి సాంకేతికత ద్వారా ప్రభుత్వ పథకాల లబ్ధి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి చేరుతోందని, దీనివల్ల మధ్యవర్తుల ప్రమేయం తొలగి పారదర్శకత పెరిగిందని చెప్పారు. ఈ లక్ష్యబద్ధమైన సంక్షేమ కార్యక్రమాల వల్లే గత దశాబ్ద కాలంలో సుమారు 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని ఆయన వివరించారు.తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంపూర్ణ సహకారాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. గత కొన్ని దశాబ్దాల్లో రాష్ట్రంలో కేవలం 5 వేల కిలోమీటర్ల జాతీయ రహదారులు మాత్రమే అభివృద్ధి కాగా, గత 12 ఏళ్ల మోదీ పాలనలోనే మరో 5 వేల కిలోమీటర్ల రహదారులను రూ.1.20 లక్షల కోట్లకు పైగా పెట్టుబడితో నిర్మించినట్లు తెలిపారు. రైల్వే రంగంలో సైతం తెలంగాణకు కేంద్రం విశేష ప్రాధాన్యం ఇచ్చిందని చెబుతూ.. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునర్నిర్మాణం, చర్లపల్లి టెర్మినల్, కాజీపేటలో రైల్వే తయారీ యూనిట్ ఏర్పాటుతో పాటు మెదక్, సిద్దిపేట, కొమురవెల్లి ప్రాంతాలకు రైల్వే లైన్లను విస్తరించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రానికి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ సేవలు అందుబాటులోకి రావడంతో పాటు, హైదరాబాద్‌ను బెంగళూరు, చెన్నై, పుణే నగరాలతో అనుసంధానించే హైస్పీడ్ రైలు కారిడార్లను తాజాగా బడ్జెట్‌లో ప్రకటించారని లక్ష్మణ్ గుర్తుచేశారు. మామునూర్, ఆదిలాబాద్ విమానాశ్రయాల అభివృద్ధితో పాటు రాష్ట్ర ఆర్థిక ప్రగతికి తోడ్పడే ఎన్నో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు కేంద్రం మద్దతు ఇస్తోందన్నారు. "సబ్‌కా సాథ్ -- సబ్‌కా వికాస్ -- సబ్‌కా విశ్వాస్ -- సబ్‌కా ప్రయాస్" అనే మూలమంత్రంతో కేంద్రం ముందుకు సాగుతూ, వికసిత భారత్ లక్ష్య సాధన దిశగా వేగంగా పయనిస్తోందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ జర్నలిస్టు కస్తూరి రాకా సుధాకర్ రావు మాట్లాడుతూ.. సమర్థవంతమైన సమాచార ప్రసారం, ప్రజలతో ప్రత్యక్ష అనుసంధానం మంచి పాలనకు అత్యంత కీలకమని అభిప్రాయపడ్డారు.నరేంద్రమోదీ.ఇన్, మైగవ్ పోర్టల్, సామాజిక మాధ్యమాలు, 'మన్ కీ బాత్' వంటి వేదికలు ప్రభుత్వ సమాచారాన్ని నేరుగా ప్రజలకు చేరవేస్తూ, వారి అభిప్రాయాలను తెలుసుకునేందుకు తోడ్పడుతున్నాయన్నారు. యువతలో ఆత్మవిశ్వాసాన్ని నింపేందుకు ప్రధాని చేపడుతున్న 'పరీక్షా పే చర్చ', ఆయన రాసిన 'ఎగ్జామ్ వారియర్స్' పుస్తకం ఎంతో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. అయితే, డిజిటల్ యుగంలో తప్పుడు సమాచార వ్యాప్తి, ప్రజాభిప్రాయాలపై జరిగే దుష్ప్రభావాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. పీఐబీ అడిషనల్ డైరెక్టర్ జనరల్ శృతి పాటిల్ తన ప్రారంభోపన్యాసంలో.. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల విలేకరులకు అవగాహన, వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు పీఐబీ దేశవ్యాప్తంగా 'వార్త', 'వార్తాలాప్' వంటి కార్యశాలలను నిర్వహిస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు, పథకాల ప్రభావంపై అర్థవంతమైన చర్చలకు ఈ వేదికలు ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. మీడియా ప్రతినిధులు ఈ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని, ప్రజలకు కచ్చితమైన, విశ్వసనీయమైన సమాచారాన్ని చేరవేయడంలో భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు.

# టిమ్స్‌లో వైద్యుల నియామకం తాత్కాలికమే

## డీఎంఈ డాక్టర్ నరేంద్ర కుమార్ స్పష్టత

తెలంగాణ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్)లో ప్రస్తుతం చేపడుతున్న డాక్టర్ల నియామకాలు కేవలం తాత్కాలికమేనని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ నరేంద్ర కుమార్ స్పష్టం చేశారు. గాంధీ, ఉస్మానియా వంటి టీచింగ్ హాస్పిటల్స్ నుంచి టిమ్స్‌కు వెళ్తున్న డాక్టర్లు కేవలం తాత్కాలిక సాయం (హెల్పింగ్ హ్యాండ్) కోసమేనని తెలిపారు. సనత్ నగర్ టిమ్స్ ఆసుపత్రిని ఏరోజు ప్రారంభించినా సేవలకు ఎలాంటి ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతోనే ఈ డిప్యూటేషన్ ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. టిమ్స్ అనేది స్వయంప్రతిపత్తి గల సంస్థ (అటనామస్ బాడీ) కాబట్టి, డీఎంఈ డాక్టర్లు అక్కడ శాశ్వతంగా కొనసాగే అవకాశం లేదని ఆయన వివరించారు.

**త్వరలోనే రెగ్యులర్ రిక్రూట్‌మెంట్**

త్వరలోనే టిమ్స్ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా రెగ్యులర్ రిక్రూట్‌మెంట్ ద్వారా శాశ్వత పోస్టులను భర్తీ చేయనుందని డీఎంఈ నరేంద్ర కుమార్ వెల్లడించారు. కొత్త డాక్టర్లు రెగ్యులర్ పద్ధతిలో విధుల్లో చేరిన వెంటనే, ప్రస్తుతం డిప్యూటేషన్‌పై వెళ్లిన డాక్టర్లందరూ తిరిగి తమ సొంత ఆసుపత్రులకు (పేరెంట్ హాస్పిటల్స్) వచ్చేస్తారని స్పష్టం చేశారు. అప్పటివరకు మాత్రమే




ఈ వైద్యుల సేవలను ప్రభుత్వం వినియోగించుకుంటుందని వివరించారు.

**సర్జరీ వైద్యులకు మినహాయింపు ఇవ్వాలని ఉస్మానియా, గాంధీ విజ్ఞప్తి**

మరోవైపు, కీలకమైన సూపర్ స్పెషాలిటీ విభాగాల నుండి డాక్టర్లను డిప్యూటేషన్‌పై టిమ్స్‌కు పంపడం పట్ల గాంధీ, ఉస్మానియా ఆసుపత్రుల సూపరింటెండెంట్లు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమైన సర్జరీలు చేసే నిపుణులైన డాక్టర్లను పంపించడం వల్ల తమ ఆసుపత్రుల్లో రోగులకు అందించే వైద్య సేవలకు ఆటంకం కలుగుతుందని వారు డీఎంఈకి విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా కీలక ఆపరేషన్లు చేసే వైద్యుల విషయంలో మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ల నుంచి వచ్చిన విజ్ఞప్తుల నేపథ్యంలో.. ఈ డిప్యూటేషన్ల అంశంపై ప్రభుత్వం మళ్లీ పునరాలోచించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**లిస్ట్ నుండి నిమ్స్ ప్రొఫెసర్ పేరు తొలగింపు**

నిమ్స్ ఆసుపత్రికి చెందిన ప్రముఖ కార్డియో థొరాసిక్ సర్జన్ ప్రొఫెసర్ అమరేశ్ పేరు పొరపాటున ఈ జాబితాలోకి వచ్చిందని, విషయాన్ని గుర్తించిన వెంటనే ఆయన పేరును

# మరోసారి డివిజన్ల పునర్విభజన: జీహెచ్ఎంసీలో 200

ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) పరిధిలోని మూడు మున్సిపల్ కార్పొరేషన్లలో మరోసారి డివిజన్ల పునర్విభజనకు రంగం సిద్ధమైంది.గతంలో ఉన్న జీహెచ్ఎంసీలో ఓఆర్ఆర్ పరిధిలోని 27 నగరపాలక, పురపాలక సంస్థలను విలీనం చేస్తూ మార్చి నెలలో ప్రభుత్వం మూడు కొత్త కార్పొరేషన్లను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ మార్పులు,చేర్పుల అనంతరం నూతనంగా ఏర్పడిన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలో 200 డివిజన్లు, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) పరిధిలో 100 డివిజన్లు, అలాగే మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) పరిధిలో మరో 100 డివిజన్ల చొప్పున పునర్విభజన చేశాకే ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ఇందుకు సంబంధించి మున్సిపల్ అధికార యంత్రాంగం ఇప్పటికే ప్రాథమిక కసరత్తు ప్రారంభించింది.ప్రస్తుతం జీహెచ్ఎంసీ పాలకవర్గం గడువు ఫిబ్రవరితో ముగియడంతో, ఈ సంస్థ ప్రత్యేకాధికారి జయేశ్ రంజన్ పాలనలో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో మూడు కార్పొరేషన్లలో తొలుత జీహెచ్ఎంసీకి మాత్రమే ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. పాతబస్తీ నియోజకవర్గాలను మినహాయించి, వెలుపల ఉన్న మిగతా నియోజకవర్గాల్లో మరిన్ని కొత్త డివిజన్లను కలిపి పునర్విభజన చేయాలని అధికారులు భావిస్తున్నారు. జీహెచ్ఎంసీలో మొత్తం 200 డివిజన్లకు గాను 101 డివిజన్లు గెలుచుకున్న పార్టీకే మేయర్ పీఠం దక్కనుంది. ఈ కీలక సమీకరణాన్ని పరిగణనలోకి తీసుకునే డివిజన్ల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ వేగవంతం కానుంది. ఈ క్రమంలోనే మొదట జీహెచ్ఎంసీ ఎన్నికలు పూర్తి చేసి, ఆ



PRGI NO: TGTEL/25/A5514

7

హైదరాబాద్

ఆదివారం,
21 జూన్ 2026

అర్జున్ సమాచారం

www.arjunsamaachaaram.in

తెలుగు దినపత్రిక

సినిమా

CINEMA



# సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబిస్తుంది

పురాణ రహస్యాలు, దివ్యశక్తుల మహిమలు, సాహసభరితమైన అంశాల కలయికతో శుక్రవారం విడుదలైన 'నాగబంధం' ట్రైలర్ విజువల్ ఫీస్ట్‌లా సాగింది. విరాట్‌కర్ణ కథానాయకుడిగా అభిషేక్ నామా దర్శకత్వంలో రూపొందుతున్న 'నాగబంధం-ది సీక్రెట్ ట్రెజర్' ట్రైలర్‌ను శుక్రవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. శతాబ్దాల నాటి రహస్యం చుట్టూ నడిచిన ఈ కథలో అనంత పద్మనాభ స్వామి ఆలయంలో భద్రపరచబడిన పవిత్రమైన బ్రహ్మకమలం కీలకమైన అంశంగా కనిపించింది. తరాలుగా రక్షింపబడుతున్న బ్రహ్మ కమలంను స్వాధీనం చేసుకోవాలనే దుష్టశక్తుల పన్నాగాలతో ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. శివుడి ఆవిర్భావం, నాగసాధువుల ప్రవేశం ట్రైలర్‌లో ఉత్కంఠను పంచాయి. ఈ సినిమా అద్భుతమైన థియేట్రికల్ అనుభూతినందిస్తుందని, టీమ్ అంతా ఓ విజన్‌తో పనిచేశామని, నిర్మాణపరంగా అత్యున్నతంగా ఉంటుందని దర్శకుడు అభిషేక్ నామా తెలిపారు. ఈ సినిమా చేయడం దైవానుగ్రహమని, మన సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించే చిత్రమిదని నిర్మాత కిషోర్ అన్నపురెడ్డి తెలిపారు. పురాతన ఆలయాల రహస్యాన్ని రాబోవు తరాలకు తెలియజేప్పే చిత్రమిదని హీరో విరాట్‌కర్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకులు అబి-జునైద్‌తో పాటు యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.



## నాగదుర్గ నాయికగా

# తెలంగాణ నేపథ్య చిత్రం



తెలంగాణ జానపద గీతాల్లో అద్భుత నాట్యాభినయాన్ని ప్రదర్శిస్తూ మంచి పేరు సంపాదించుకుంది నాగదుర్గ. ఆమె పాటలు, ప్రైవేట్ ఆల్బమ్స్ సోషల్‌మీడియాలో రికార్డు స్థాయి వీక్షణలతో ప్రేక్షకుల్ని అలరించాయి. తాజాగా ఆమె కథానాయికగా అరంగేట్రం చేస్తున్నది. ప్రియదర్శి హీరోగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ప్రముఖ దర్శకుడు సుకుమార్, నిర్మాత బన్నీ వాసు తెరకెక్కిస్తుండటం విశేషం.తెలంగాణ నేపథ్య కుటుంబ కథాంశంతో రూపొందనున్న ఈ చిత్రానికి వంశీ రెడ్డి దర్శకత్వం వహించనున్నారు. ఈ నెల 25న లాంఛనంగా సినిమాను ప్రారంభించి, వచ్చే నెలలో రెగ్యులర్ షూటింగ్ మొదలుపెడతామని, ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో వెల్లడిస్తామని మేకర్స్ పేర్కొన్నారు. బన్నీ వాస్ వర్క్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించనున్నాయి.



## అవినీతిని

# ప్రశ్నించే పాత్రలో!

**అగ్ర నటుడు నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో ఓ భారీ యాక్షన్ చిత్రం రూపొందుతున్న విషయం తెలిసిందే. 'చీదీఖ 111' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలున్నాయి. బ్లాక్‌బస్టర్ 'వీరసింహారెడ్డి' తర్వాత వీరి కలయికలో వస్తున్న సినిమా కావడమే అందుకు కారణం.**

బాలకృష్ణ పుట్టినరోజు కానుకగా ఇటీవల విడుదల చేసిన గ్లింప్స్ కూడా సినిమాపై అంచనాలు పెంచింది. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్ కథానాయికగా నటిస్తున్నది.శుక్రవారం ఆమె పుట్టినరోజు సందర్భంగా ఇందులోని కాజల్ పోషిస్తున్న పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ప్రభుత్వ కార్యాలయ వాతావరణంలో.. ఫైళ్లు, అధికారిక పత్రాల మధ్య కళ్లజోడుతో హుందాగా నిలబడివున్న కాజల్‌ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. కాజల్ గెటప్‌ని బట్టి, ఇందులో ఆమె ప్రభుత్వ అధికారిణి పాత్ర పోషిస్తున్నదని అర్థమవుతున్నది. ఆత్మవిశ్వాసం, నిబద్ధత, స్థిరత్వం ఆమె కళ్లలో ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. 1993 ముంబై నేపథ్యంలో ఉత్కంఠకు గురిచేసే హింసాత్మక ప్రపంచానికి ఎదురునిలిచే డేర్ డెవిల్‌గా ఇందులో కాజల్ కనిపించనున్నట్టు తెలుస్తున్నది. ప్రస్తుతం ముంబైలో చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ యాక్షన్ డ్రామాలో మంచు మనోజ్ కీలక పాత్ర పోషిస్తున్నారు.



# నువ్వే నా లైఫ్‌కి క్వీన్

మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్, ఆయ్ చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న యువ నటుడు నార్నే నితిన్ హీరోగా ఓ కామెడీ ఎంటర్‌టైనర్ తెరకెక్కనున్నది. రాధాకృష్ణారెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ప్రతిష్ఠాత్మక కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె.నారాయణ నిర్మిస్తున్నారు. శుక్రవారం నార్నే నితిన్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ని మేకర్స్ విడుదుల చేశారు.ఇన్‌స్టా పోస్ట్ తరహాలో డిజైన్ చేసిన ఈ పోస్టర్ యూత్‌ని ఆకట్టుకుంటున్నదని మేకర్స్ చెబుతున్నారు. నీలాకాశం నేపథ్యంలో, ఓ భవనం అంచున కూల్‌గా కూర్చున్న నార్నే నితిన్‌ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. 'ఆకాశంలో ఉంటుంది మూన్.. నువ్వే నా లైఫ్‌కి క్వీన్..' అనే ఫన్నీ లైన్‌తో పాటు వేలాది లైక్స్, కామెంట్స్, ట్రెండీ హ్యాష్‌ట్యాగ్స్ ఈ పోస్టర్‌కి ఆకర్షణగా నిలిచాయి. నితిన్ బావ ఎన్టీఆర్ ఈ పోస్ట్‌కి లైక్ కొట్టినట్టు చూపించడం అభిమానుల్ని అకట్టుకుంటున్నది. ఈ చిత్రానికి కెమెరా: రామమారుతి.ఎం.

# బుజ్జి గుండెలోకి వెల్కమ్

'ఇరవయ్యవ పడిలో ఉన్న ఓ అమ్మాయి, నలభై ఏండ్ల వయసున్న వ్యక్తి ప్రేమలో పడితే వారి సంక్లిష్ట బంధం ఎలాంటి మలుపులు తిరిగింది? వయోవ్యత్యాసం తాలూకు భావోద్వేగాలు, నైతిక సంఘర్షణ వారి బంధాన్ని ఎలా ప్రభావితం చేశాయో తెలుసుకోవాలంటే 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమా చూడాల్సిందే. ఈ రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో సూర్య, మమితాబైజు, రవీనా టాండన్, రాధికా శరత్‌కుమార్ ప్రధాన పాత్రధారులు. వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సూర్య దేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్నారు.ఆగస్ట్ 14న ప్రేక్షకుల ముందుకురానుంది. శుక్రవారం 'నేనో బటర్‌ఫ్లై..' అనే తొలిపాటను విడుదల చేశారు. జీవీ ప్రకాష్‌కుమార్ స్వరపరచిన ఈ గీతాన్ని రామజోగయ్యశాస్త్రి రచించారు. సుభాషిని ఆలపించారు. 'పుట్టా ముద్దుగా నిన్నే పట్టుకోగ, చుట్టా బొంగరంగా నిన్నే చుట్టుకోగ..గుడ్‌మార్నింగ్ సూర్యుడల్లే తట్టి నిద్రలేపినావే నాలో ప్రేమని, గ్రీన్‌సిగ్నల్ ఇచ్చుకోవే బుజ్జి గుండెలోకి వెల్కమ్ అంటూ రమ్మని..నేనో బటర్‌ఫ్లై..' అంటూ ప్రేమలోని భావోద్వేగాల్ని ప్రతిబింబిస్తూ ఈ పాట సాగింది. హృదయానికి హత్తుకునే ఫ్యామిలీ ఎమోషన్స్‌తో అన్ని వర్గాలను అలరించే సినిమా ఇదని మేకర్స్ తెలిపారు.



## ఆరోగ్యకర వృద్ధాప్యానికి యోగానే మార్గం: రఘునాథ్ వెరబెల్లి.



**అర్జున్ సమాచారం జూన్ 20మంచిర్యాల ప్రతినిధి:**

12వ అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఒక రోజు కౌంట్‌డౌన్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం మంచిర్యాల పట్టణంలోని ఐబీ చౌరస్తాలో సామూహిక యోగా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. "ఆరోగ్యకర వృద్ధాప్యానికి యోగ" అనే నినాదంతో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగ సాధన శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడంతో పాటు క్రమశిక్షణతో కూడిన జీవన విధానానికి దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. యోగాను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యోగ గురువులు, యోగ సాధకులు, పట్టణ ప్రముఖులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వివిధ యోగాసనాలను ప్రదర్శించారు. అనంతరం యోగా బోధనలో విశేష సేవలు అందిస్తున్న యోగ గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడగా, పాల్గొన్నవారు యోగా ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు.

## యోగ సేవలకు ఘన సత్కారం:

### ఆరోగ్యవంతమైన జీవనానికి యోగమే ఉత్తమ మార్గమని పిలుపు!



**అర్జున్ సమాచారం జూన్ 20మంచిర్యాల.ప్రతినిధి:**

మంచిర్యాల, జూన్ 20: పన్నెండవ అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రెడ్డి కాలనీలో నివసిస్తున్న ఓం అష్టోత్తర యోగ పీఠం యోగ గురువు గుండా విజయకుమార్ ఆర్య దంపతులకు ఘన సత్కారం నిర్వహించారు.యోగాభ్యాసకుడు, సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య పూల గుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా గజెల్లి వెంకటయ్య మాట్లాడుతూ యోగ సాధన శారీరక, మానసిక ఆరోగ్యాలకు ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా యోగ సాధన చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనం సాధ్యమవుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.యోగ గురువు గుండా విజయకుమార్ ఆర్య దంపతులు యోగ ప్రచారానికి, ఆరోగ్య చైతన్యానికి అందిస్తున్న సేవలను కొనియాడుతూ పలువురు అభినందనలు తెలిపారు."ప్రతిరోజూ యోగ సాధన చేయండి... ఆరోగ్యంగా జీవించండి" అని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# కేంద్ర నిధులతో మంచిర్యాల అభివృద్ధికి వేగం

### జాతీయ రహదారులు, రైల్వే సదుపాయాలతో జిల్లాకు కొత్త రూపు : నగునూరి వెంకటేశ్వర్ గౌడ్

**అర్జున్ సమాచారం జూన్ 20మంచిర్యాల.ప్రతినిధి:**



మంచిర్యాల కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తున్న నిధుల కారణంగా మంచిర్యాల జిల్లాకు అభివృద్ధి పరంగా కొత్త అవకాశాలు లభిస్తున్నాయని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ పేర్కొన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనకు పన్నెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న ప్రగతి పథం కార్యక్రమంలో భాగంగా జైపూర్ మండలంలోని నర్వ నుంచి వరంగల్ వరకు నిర్మాణంలో ఉన్న నాలుగు వరుసల జాతీయ రహదారి పనులను పార్టీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ నాగపూర్--విజయవాడ ఆర్థిక మార్గంలో భాగంగా రూ.3,400 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న నర్వ--వరంగల్ జాతీయ రహదారి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ పనులు పూర్తయిన తర్వాత జిల్లా ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు.అలాగే జాతీయ రహదారి--63 అభివృద్ధి కింద ఆర్మూర్ నుంచి మంచిర్యాల వరకు కొత్త రహదారి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.5,200 కోట్లు మంజూరు చేసిందని, త్వరలో పనులు ప్రారంభమయ్యే అవకాశముందని వెల్లడించారు.మంచిర్యాల నుంచి వాంకిడి వరకు రూ.3,800 కోట్ల వ్యయంతో చేపట్టిన జాతీయ రహదారి--363 పనులు పూర్తయ్యాయని, ఇటీవల కేంద్ర రహదారుల శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అంకితం చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

ఇవే కాకుండా మంచిర్యాల రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.30 కోట్లు, పాదచారుల వంతెన నిర్మాణానికి రూ.3 కోట్లు, జలచరాల పెంపక కేంద్రాల ఏర్పాటు సహా పలు అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దుర్గం అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి వంగపిండి వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు పట్టి వెంకట కృష్ణ, సీనియర్ నాయకులు దేవరనేని సంజీవరావు, మండల ఇన్‌చార్జి మంత్రి రామయ్య, మండల అధ్యక్షులు దూట రాజ్‌కుమార్, నాయకులు చేగొండ శ్రీనివాస్, మాజీ జిల్లా ఉపాధ్యక్షులు రాపర్తి వెంకటేశ్వర్, చెన్నూరు మండల అధ్యక్షులు బుర్ర రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# యోగతో ఆరోగ్యం -- ప్రతి ఒక్కరూ యోగను అలవాటు చేసుకోవాలి

### అర్జున సమాచారం దినపత్రిక: ఎడిటర్ లింగం రాజయ్య.

**అర్జున సమాచారం, మంచిర్యాల జిల్లా:ప్రతినిధి.**

నేటి కాలంలో చిన్నపిల్లల నుండి పెద్దల వరకు అనేక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని, వాటిని నివారించడానికి ప్రతిరోజూ యోగాభ్యాసం చేయడం ఎంతో అవసరమని అర్జున సమాచారం దినపత్రిక ఎడిటర్ లింగం రాజయ్య అన్నారు. ఆరోగ్యవంతమైన జీవితం కోసం యోగ ఉత్తమ మార్గమని, ప్రతి ఒక్కరూ తమ రోజువారీ జీవితంలో యోగకు కొంత సమయం కేటాయించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆధునిక జీవనశైలి, సరైన ఆహారపు అలవాట్లు లేకపోవడం, శారీరక శ్రమ తగ్గిపోవడం వల్ల అనేక రకాల వ్యాధులు పెరుగుతున్నాయని అన్నారు. ముఖ్యంగా యువత ఎక్కువ సమయం మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, సోషల్ మీడియాతో గడపడం వల్ల శారీరక, మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇలాంటి



అర్జున్ సమాచారం
ఎడిటర్ లింగం రాజయ్య

పరిస్థితుల్లో యోగ మన శరీరానికి, మనసుకు కొత్త ఉత్సాహాన్ని అందిస్తుందని చెప్పారు. ప్రతిరోజూ కనీసం అరగంట యోగ చేయడం వల్ల శరీరం దృఢంగా మారడమే కాకుండా మనసు ప్రశాంతంగా ఉంటుందని తెలిపారు. యోగ ద్వారా రక్తపోటు, మధుమేహం, ఊబకాయం, నిద్రలేమి, ఒత్తిడి వంటి అనేక సమస్యలను నియంత్రించుకోవచ్చని పేర్కొన్నారు. అంతేకాకుండా శ్వాసకోశ సమస్యలు తగ్గి, రోగనిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. విద్యార్థులు యోగ చేయడం వల్ల ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరిగి చదువులో మంచి ఫలితాలు సాధించగలరని అన్నారు. ఉద్యోగులు, వ్యాపారులు, మహిళలు, వృద్ధులు కూడా యోగను అలవాటు చేసుకుంటే ఆరోగ్యంగా, ఉత్సాహంగా జీవించవచ్చని తెలిపారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండి యోగ, వ్యాయామం, క్రీడలను తమ జీవితంలో భాగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ప్రతి వ్యక్తి బాధ్యత అని, ఆరోగ్యం ఉంటేనే కుటుంబం సంతోషంగా, సమాజం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో, ప్రతి పాఠశాలలో, ప్రతి కళాశాలలో, ప్రతి కార్యాలయంలో యోగపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన కోరారు. యోగ భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప సంపద అని, దానిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. "ఆరోగ్యమే మహాభాగ్యం... ప్రతి ఇంట్లో యోగ -- ప్రతి వ్యక్తికి ఆరోగ్యం" అనే లక్ష్యంతో ముందుకు సాగాలని, ప్రతిరోజూ యోగ చేసి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి అందరూ సహకరించాలని అర్జున సమాచారం దినపత్రిక ఎడిటర్ లింగం రాజయ్య పిలుపునిచ్చారు.

# యాంత్రిక విత్తనాల విత్తకంతో పత్తి సాగులో కొత్త దిశ:

### అధిక సాంద్రత సాగు పద్ధతులతో అధిక దిగుబడుల సాధనకు రైతులకు అవగాహన.

**అర్జున సమాచారం, మంచిర్యాల జిల్లా:ప్రతినిధి.**

మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలం పొలంపల్లి గ్రామానికి చెందిన రైతు మొగిలి పొలంలో శనివారం అధిక సాంద్రత పత్తి సాగులో యాంత్రిక విత్తనాల విత్తకం ప్రదర్శన కార్యక్రమాన్ని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పంట ఉత్పత్తి శాస్త్రవేత్త డాక్టర్ ఎన్. మహేష్ మాట్లాడుతూ అధిక సాంద్రత పత్తి సాగు ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని తెలిపారు. సరైన మొక్కల సాంద్రత, నీటి పొదుపు, ఎరువుల సమర్థ వినియోగం, కలుపు నివారణలో సౌలభ్యం లభిస్తుందని వివరించారు. ప్రస్తుతం వ్యవసాయ కూలీల కొరత పెరుగుతున్న నేపథ్యంలో యాంత్రీకరణకు ప్రాధాన్యం పెరిగిందన్నారు. యాంత్రిక విత్తనాల యంత్రం ద్వారా ఒక ఎకరం విస్తీర్ణంలో విత్తనాల విత్తకం గంటలోపే పూర్తవుతుందని, సమయం, శ్రమ, ఖర్చు గణనీయంగా తగ్గుతాయని చెప్పారు. విత్తనాలు సమాన దూరంలో, సరైన లోతులో పడటం వల్ల మొక్కల పెరుగుదల ఏకరీతిగా ఉండి మెరుగైన దిగుబడులు పొందవచ్చని తెలిపారు. అధిక సాంద్రత పత్తి సాగుకు అనువైన రకాల ఎంపిక, వరుసల మధ్య పాటించాల్సిన దూరం, సమతుల్య ఎరువుల వినియోగం, నేల సారాన్ని పెంపొందించే చర్యలు, సమగ్ర పంట యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరించారు. సమతుల్య ఎరువుల వినియోగం ద్వారా నేల ఆరోగ్యం మెరుగుపడి స్థిరమైన ఉత్పత్తి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రశాంత్, వ్యవసాయ యంత్రాల సంస్థ ప్రతినిధులు, కృషి విజ్ఞాన కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by LINGAM RAJAIAH, and Printed at Vijaya Lakshmi Printing Press , H.No.12-180, Gouthaminagar,Mancheria, Mancherial Telangana-504208, and Published at H.No.12-180, Gouthami-nagar,Mancheria,Mancherial Telangana-504208. Editor: LINGAM RAJAIAH. PRGI. No. TGTEL/25/A5314, lingamrajaiahmncl@gmail.com,8121319896.